ఈనాడు
శ్రీకాకుళం
సోమవారం ఆగస్టు 31, 2026

కంకరపై కన్నేశారు



సారవకోట మండలం సత్రాం పంచాయతీ గొల్లపేట నుంచి జమచక్రం వెళ్లే మార్గంలో కంకర కోసం అర కిలోమీటరు పొడవునా యథేచ్ఛగా కొండను పిండిచేస్తున్నారు. ఈ మార్గంలో ప్రజల రాకపోకలు ఉండవు. ఇదే అదనుగా మూడు ప్రాంతాల్లో తవ్వకాలు చేపట్టి ట్రాక్టర్లతో తరలిస్తున్నారని, అధికారులు పట్టించుకోవడం లేదని స్థానికులు ఆరోపిస్తున్నారు. వీఆర్వో రాంబాబు వద్ద ప్రస్తావించగా పరిశీలించి తహసీల్దార్‌కు నివేదిస్తానన్నారు.

– న్యూస్‌టుడే, సారవకోట

నీట్ పీజీ ప్రశాంతం



జిల్లాలో నీట్ పీజీ-2026 ప్రశాంతంగా జరిగింది. 697 మంది అభ్యర్థులకు 682 మంది హాజరయ్యారు. చిలకపాలెంలోని శ్రీ శివాని ఇంజినీరింగ్ కళాశాలలో 266, శ్రీవెంకటేశ్వర కాలేజీ ఆఫ్ ఇంజినీరింగ్ అండ్ టెక్నాలజీలో 97, నరసన్నపేట కోర్ టెక్నాలజీస్‌లో 305, టెక్కలి ఆదిత్య ఇనిస్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ అండ్ మేనేజ్‌మెంట్ కళాశాలలో 14 మంది హాజరయ్యారు. ఆర్డీవో కె.సాయిప్రత్యూష కేంద్రాలను తనిఖీ చేశారు. ఎచ్చెర్ల శ్రీ వేంకటేశ్వర కళాశాలలో విద్యార్థిని తనిఖీ చేస్తున్న చిత్రం చూడొచ్చు.

–న్యూస్‌టుడే, కలెక్టరేట్ (శ్రీకాకుళం)

ఆక్రమిస్తాం.. అడిగితే అంతు చూస్తాం..!

– న్యూస్‌టుడే, గార (శ్రీకూర్మం)

ప్రభుత్వ స్థలాలు ఆక్రమణలకు గురవుతున్నాయి. అధికారులకు తెలిసినా.. వేడుక చూస్తున్నారే తప్ప పట్టించుకోవడం లేదని స్థానికులు అసహనం వ్యక్తం చేస్తున్నారు. రాజకీయ ఒత్తిళ్లకు తలొగ్గి చర్యలు తీసుకునేందుకు వెనకాడుతున్నారనే విమర్శలొస్తున్నాయి. గార మండలం శ్రీకూర్మంలో సెంటు రూ.8 లక్షల నుంచి రూ. 10 లక్షల వరకు పలుకుతోంది. అంత డిమాండ్ ఉన్న ప్రభుత్వ స్థలాలను కొందరు తేలిగ్గా ఆక్రమించేస్తున్నారు. అడిగితే కేసులు బనాయిస్తామని, రేషను కార్డులు రద్దు చేయిస్తామని బెదిరిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

కబ్జాదారుల చేతుల్లోకి..

★ పాత బస్టాండు సమీపంలోని 15 సెంట్లు ఆక్రమణకు గురికాగా ప్రస్తుతమున్న బస్టాండ్ దగ్గరలోని 8 సెంట్ల పంచాయతీ రిజర్వు స్థలం సైతం కబ్జా చేశారు.

★ తితిదే సత్రం సమీపంలో పంచాయతీ స్థలంలో ఉన్న నీటి ట్యాంకు వద్ద 2015లో ప్రజా ప్రయోజనం కోసం శుద్ధజలం ప్లాంటు ఏర్పాటు చేసుకునేందుకు ఓ వ్యక్తికి అప్పటి ప్రభుత్వం తాత్కాలికంగా స్థలం కేటాయించింది. ఇప్పుడు సదరు వ్యక్తి ఆ స్థలం తనదేనని అంటున్నారు. దీని విలువ రూ.30 లక్షలు.



తితిదే సత్రం సమీపంలో ఆక్రమణకు గురైన స్థలం

★ 'ప్రభుత్వ స్థలాల్లో ఎలాంటి నిర్మాణాలు జరిగినా.. చర్యలు తీసుకుంటాం. ఇప్పటికే పలువురికి నోటీసులు అందించాం. విషయాన్ని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లాం.' అని పంచాయతీ కార్యదర్శి కె. ఈశ్వరమ్మ తెలిపారు.

సమస్యల పరిష్కారానికి దశల వారీగా ఉద్యమిస్తాం

బలగ(శ్రీకాకుళం), న్యూస్‌టుడే: సమస్యల పరిష్కారానికి దశల వారీగా ఉద్యమిస్తామని వైద్య ఆరోగ్య శాఖ ఒప్పంద ఉద్యోగులు పేర్కొన్నారు. రాష్ట్ర ఐకాస పిలుపు మేరకు జీజీహెచ్ యూనిట్ అధ్యక్ష, కార్యదర్శులు బి. అశోక్, బి.సంతోష్‌కుమార్ ఆధ్వర్యంలో ఆదివారం శ్రీకాకుళం ప్రభుత్వ సర్వజన ఆసుపత్రి వద్ద నిరసన తెలిపారు. ఆన్‌లైన్ పనులు నిలిపేశారు. మధ్యాహ్న భోజన విరామ సమయంలో మానవ హారంగా ఏర్పడి నినాదాలు చేశారు. న్యాయపరమైన డిమాండ్లను పరిష్కరించాలని కోరారు. వచ్చే నెల 2, 3 తేదీల్లో ఆందోళన, 6న ప్రభుత్వ ఆసుపత్రుల వద్ద, 7న కలెక్టరేట్ ఎదుట ధర్నాలు చేపడుతున్నట్లు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఐకాస ఛైర్మన్ వేదవతి లక్ష్మీబాయి, జీజీహెచ్ యూనిట్ ఉపాధ్యక్షుడు సీహెచ్.శివకుమారి, కోశాధికారి బి.కృష్ణవేణి, శ్రీకాంత్, కె.ఫాల్గుణరావు, కె.శివప్రసాద్ పాల్గొన్నారు.



సర్వజన ఆసుపత్రి వద్ద నిరసన తెలుపుతున్న ఒప్పంద ఉద్యోగులు

నేడు ప్రజా ఫిర్యాదుల నమోదు, పరిష్కార వేదిక

కలెక్టరేట్(శ్రీకాకుళం), న్యూస్‌టుడే: ప్రజా ఫిర్యాదుల నమోదు, పరిష్కార వేదిక జిల్లా పరిషత్తు సమావేశ మందిరంలో సోమవారం నిర్వహించనున్నట్లు కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ ఆదివారం తెలిపారు. అర్జీదారులు నేరుగా లేదా meekosam.ap.gov.in వెబ్‌సైట్‌లో వినతులు సమర్పించవచ్చన్నారు. అనంతరం 1100 కాల్ చేసి అర్జీ ఏ స్థితిలో ఉందో తెలుసుకోవచ్చు.

ఎన్నాళ్లీ అసంపూర్తి నిర్మాణాలు ?



సారవకోట మండలం కేలవలసలో సచివాలయం నిర్మాణం కోసం గత ప్రభుత్వం రూ.40 లక్షలు మంజూరు చేసింది. గుత్తేదారు శ్లాబ్ వరకు పనులు పూర్తి చేసి అనంతరం బిల్లుల చెల్లింపుల్లో జాప్యంతో వదిలేశారు. దీంతో సిబ్బంది రైతుసేవా కేంద్రంలో విధులు నిర్వహిస్తున్నారు. మూడేళ్లుగా పనులు నిలిచిపోవడంతో ఇబ్బందులు తప్పడం లేదని వాపోతున్నారు. కూటమి అధికారంలోకి వచ్చాక వీటి పేరు స్వర్ణ గ్రామ కార్యాలయాలుగా మార్చారే తప్ప అసంపూర్తి నిర్మాణాల గురించి పట్టించుకోలేదని పలువురు పేర్కొంటున్నారు. ఈ విషయాన్ని పీఆర్ ఏఈఈ భార్గవి వద్ద ప్రస్తావించగా ప్రభుత్వం నుంచి అనుమతులు రావాల్సి ఉందన్నారు. – న్యూస్‌టుడే, సారవకోట

లబ్బ దారి.. అధ్వానంగా మారి!



కొత్తూరు మండలం లబ్బ పంచాయతీ కేంద్రానికి వెళ్లే గ్రామీణ రహదారి గులివిందలపేట నుంచి 2.4 కి.మీ మేర దారుణంగా మారింది. ఐటీడీఏ వసతి గృహం, జీసీసీ డిపో, స్వర్ణ గ్రామ కార్యాలయ సిబ్బందితోపాటు లబ్బ, కారిగూడ పంచాయతీల ప్రజలకు ఇదే ప్రధాన మార్గం కావడంతో అంతా ఇబ్బంది పడుతున్నారు. అధికారులు చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు. పీఆర్ ఏఈ దుర్గాప్రసాద్ మాట్లాడుతూ రూ. 80 లక్షలతో పనులకు ప్రతిపాదించామని పేర్కొన్నారు. – న్యూస్‌టుడే, కొత్తూరు

డంపింగ్ యార్డులా మార్చేశారు



బారువ మేజర్ పంచాయతీలో సేకరించిన వ్యర్థాలను గొల్లగండి రోడ్డుపై వేస్తున్నారు. కొంతకాలంగా సంపద తయారీ కేంద్రాన్ని వినియోగించకపోవడంతో నానాటికీ చెత్త పేరుకుపోతోంది. దీంతో తీరప్రాంత గ్రామాల ప్రజలు దుర్వాసనతోపాటు రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. పక్కనే బారువ కాళికాదేవి ఆలయం ఉండటంతో భక్తులకూ అవస్థలు తప్పడం లేదు. దీనిపై బారువ ఈవో రాజేష్‌ను వివరణ కోరగా సంపద తయారీ కేంద్రం నిండిపోవడంతో ఇబ్బందులు నెలకొన్నాయని, రోడ్డుపై చెత్త తొలగించేందుకు చర్యలు తీసుకుంటామన్నారు. – న్యూస్‌టుడే, సోంపేట

గుంతలు పూడ్చారు

స్పందనకు వందనం

వజ్రపుకొత్తూరు గ్రామీణం, న్యూస్‌టుడే: వజ్రపుకొత్తూరు మండలం పూండి నుంచి పీజేపురం మీదుగా మంచినీళ్లపేట వరకు ఉన్న ఆర్‌అండ్‌బీ రోడ్డు పూర్తిగా పాడైంది. ఇటీవల వర్షాలకు పీజేపురం వద్ద రహదారి గుంతలో ఓ ఆటో చిక్కుకుంది. త్రుటిలో ప్రమాదం తప్పింది. దీనిపై ఈనెల 23న 'సహనం ఉండాలి.. సాహసం చేయాలి' శీర్షికన ప్రచురితమైన కథనానికి సంబంధిత శాఖాధికారులు స్పందించారు. ఘటన జరిగిన ప్రదేశంలో రూ.50 వేలు ఖర్చు చేసి 30 మీటర్ల మేర గుంతలు పూడ్చారు. రహదారి బాగుకు రూ.30 లక్షలతో అంచనాలు తయారుచేశామని, త్వరలో పూర్తిస్థాయిలో పనులు చేపడతామని జేఈ జగదీశ్ తెలిపారు.

నేత్రదానంపై అవగాహన ర్యాలీ



జాతీయ అంధత్వ నివారణ కార్యక్రమంలో భాగంగా శ్రీకాకుళం నగరంలో 80 ఫీట్ వాకర్స్ క్లబ్ ఆధ్వర్యంలో ఆదివారం నేత్రదానంపై అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఆప్తాల్మిక్ అధికారి ఎం.ఆర్.కె.దాస్ కంటి ఆరోగ్యం, నేత్రదానంపై చైతన్యం కల్పించారు. మరణానంతరం నేత్రాలను దానం చేయడం ద్వారా అంధులకు చూపును ప్రసాదించవచ్చని చెప్పారు. ప్రతి ఒక్కరూ అపోహలు వీడి ముందుకు రావాలని కోరారు. కార్యక్రమంలో క్లబ్ అధ్యక్షుడు వైశ్యరాజు తిరుమలరాజు, కార్యదర్శి పొట్నూరు మాధవరావు పాల్గొన్నారు. 30 మంది వాకర్స్ తమ కుటుంబ సభ్యులతో నేత్రదానం చేస్తామని ప్రతిజ్ఞ చేసి, ఇందుకు సంబంధించిన పత్రాలను జిల్లా అంధత్వ నివారణ సంస్థకు అందజేశారు.

– న్యూస్‌టుడే, బలగ(శ్రీకాకుళం)

కరుగుతున్న కాలం.. చెదురుతున్న కలలు

ఎస్‌జీఎఫ్ షెడ్యూల్ విడుదలలో జాప్యంతో నష్టపోతున్న విద్యార్థులు

– న్యూస్‌టుడే, పాతబస్టాండ్

విద్యార్థుల క్రీడా భవిష్యత్తుకు గట్టి పునాది వేయడంలో పాఠశాల క్రీడలదే ప్రథమస్థానం. క్రీడాస్ఫూర్తిని పెంపొందించే వీటి నిర్వహణకు షెడ్యూల్ విడుదల చేయలేదు. దీనికి ప్రధాన కారణం ఎస్‌జీఎఫ్ కార్యదర్శుల నియామకంలో చోటు చేసుకుంటున్న జాప్యం. దీంతో గత సంవత్సరంలాగే ఈ ఏడాది కూడా స్వల్ప కాలవ్యవధిలో పలు పోటీలు నిర్వహించక తప్పని పరిస్థితి. దీంతో ప్రతిభ గల విద్యార్థుల క్రీడా భవిష్యత్తు ప్రశ్నార్థకం కానుందనే భావన బలపడుతోంది.

గతంలో ఇలా..

- ఈ క్రీడలకు సంబంధించి 2024 వరకు ఎస్‌జీఎఫ్ కార్యదర్శి ఒక్కరే ఉండేవారు. రెండేళ్ల పదవీ కాలానికి నిర్వహణ బాధ్యత తీసుకునేవారు. వ్యాయామ ఉపాధ్యాయుల సీనియారిటీ ప్రకారం జిల్లా విద్యాశాఖ అధికారి నామినేట్ చేసేవారు. ముందుగా రూపొందించిన ప్రణాళికతో పలు క్రీడల్లో ప్రతి విద్యార్థి పాల్గొని రాష్ట్ర, జాతీయ స్థాయిల్లో ప్రతిభ చూపించేందుకు అవకాశముండేది.
- గతేడాది నుంచి అడ్మిన్, ఆర్గనైజర్లుగా ఇద్దరు కార్యదర్శులను కమిషనర్ ఆఫ్ స్కూల్ ఎడ్యుకేషన్ ఆధ్వర్యంలో ఇంటర్వ్యూలు నిర్వహించి నియమిస్తున్నారు. 2025లో వీరి నియామకంలో జరిగిన ఆలస్యంతో కుదించి క్రీడలు నిర్వహించాల్సి వచ్చింది. వేర్వేరు ప్రాంతాల్లో ఒకే రోజు పలు పోటీలు జరగడం వల్ల చాలా మంది విద్యార్థులు అవకాశాలను చేజార్చుకున్నారు.

ఈ ఏడాది అదే తీరు

★ 2026- 27కు సంబంధించి జులై మొదటి వారంలో నోటిఫికేషన్ ప్రకటించి సీనియారిటీ ప్రకారం నామినేట్ చేసి పంపారు. ఆగస్టు నెలలో వీరికి ఇంటర్వ్యూలు నిర్వహించినా నేటికీ సెక్రటరీలను ప్రకటించలేదు.

★ ఈ పోటీల్లో సాధారణంగా ఒక్కో విద్యార్థి మూడేసి క్రీడలను ఆడేందుకు అవకాశముంటుంది. ఈ జాప్యంతో ప్రతిభ గలవారు సైతం ఒక క్రీడలో మాత్రమే పోటీపడాల్సి ఉంటుంది.

★ వేర్వేరు చోట్ల క్రీడలు జరగడంతో ఎస్‌జీఎఫ్ కార్యదర్శులు పూర్తిస్థాయిలో పర్యవేక్షించ లేకపోయారు. ఈ కారణంగా తమకు అనుకూలమైన విద్యార్థులను జాబితాల్లో చేర్చారని ఆరోపణలున్నాయి. ఇలాంటి ఘటనలు ఈ ఏడాది పునరావృతం కాకుండా షెడ్యూల్‌ను ముందుగానే ప్రకటిస్తే మంచిదని పలువురు అభిప్రాయపడుతున్నారు.

టెట్ నుంచి మినహాయింపు ఇవ్వాలి



సమావేశంలో మాట్లాడుతున్న అపోటా రాష్ట్ర అధ్యక్షుడు భాస్కర్‌పాఢి

సోంపేట, న్యూస్‌టుడే: ఇన్‌సర్వీస్ ఉపాధ్యాయులకు టెట్ నుంచి మినహాయింపు ఇవ్వాలని ఆంధ్రప్రదేశ్ ఒడియా టీచర్స్ అసోసియేషన్(అపోటా) ప్రతినిధులు డిమాండ్ చేశారు. సోంపేటలో అపోటా రాష్ట్ర అధ్యక్షుడు భాస్కర్‌పాఢి అధ్యక్షతన ఆదివారం జరిగిన జిల్లాస్థాయి సమావేశంలో రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బృందావన్ దొళాయి, ముఖ్య సలహాదారు డీపీ చౌదరి, ఉపాధ్యక్షుడు రామహరి పాఢి, సంయుక్త కార్యదర్శి సుదామ్ నాయక్ ఇతర ప్రతినిధులు మాట్లాడారు. టెట్ నుంచి మినహాయింపునకు అవకాశం లేకపోతే 40 శాతం ఉత్తీర్ణత మార్కులుగా నిర్ణయించాలని డిమాండ్ చేశారు. బయాలాజికల్, మ్యాథ్స్ ఉపాధ్యాయులకు ప్రత్యేకంగా 60 మార్కులకు పరీక్ష నిర్వహించాలన్నారు. ఒడియా బ్యాక్‌లాగ్ పోస్టులపై ఉన్న స్టేను రద్దు చేసి రాబోయే డీఎస్సీలో వాటిని భర్తీ చేసేలా చర్యలు తీసుకోవాలని కోరారు. మండల అధ్యక్ష, కార్యదర్శులు పురేంద్ర బిసాయి, తరుణ్‌పాణి, ప్రతినిధులు కృష్ణచంద్ర, జిజ్ఞాస్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

గౌరవ వేతనం అందించాలని వినతి



రాష్ట్ర అదనపు ఎన్నికల అధికారి ఢిల్లీరావుకు వినతిపత్రం అందిస్తున్న జిల్లా ఎన్నికల కంప్యూటర్ ఆపరేటర్లు

పలాస, న్యూస్‌టుడే: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న సర్ ప్రక్రియలో పని చేసిన కంప్యూటర్ ఆపరేటర్లకు గౌరవ వేతనం అందించేలా చర్యలు తీసుకోవాలని జిల్లాలోని ఎన్నికల కంప్యూటర్ ఆపరేటర్లు కోరారు. ఈ మేరకు శ్రీకాకుళంలో రాష్ట్ర అదనపు ఎన్నికల అధికారి ఢిల్లీరావును కలిసి వినతిపత్రం అందజేశారు. విధుల నిర్వహణలో ఎదుర్కొంటున్న పనిభారం, సాంకేతిక సమస్యలను వివరించారు. అనంతరం ఢిల్లీరావును సత్కరించారు. రాజేష్, సిమ్మన్న, హరి, కోదండ, సుధాకర్ పాల్గొన్నారు.

వంశధార కుడి కాలువలో మునిగి ఒకరి మృతి



కొంకి గోవిందరావు (పాత చిత్రం)

హిరమండలం, న్యూస్‌టుడే: హిరమండలం పరిధి చిన్నకోరాడకు చెందిన కొంకి గోవిందరావు(37) ఆదివారం వంశధార కుడి ప్రధాన కాలువలో మునిగి మృతి చెందారు. ఎస్సై మధుసూదనరావు తెలిపిన వివరాల ప్రకారం.. సదరు వ్యక్తి పొలం పనులకు వెళ్లి తిరిగి వచ్చే సమయంలో గ్రామం దగ్గరలోని కాలువలో స్నానానికి దిగి గల్లంతయ్యారు. స్థానికుల సమాచారం మేరకు అగ్నిమాపక సిబ్బంది, పోలీసులు అక్కడికి చేరుకుని పరిశీలించారు. ప్రమాద సమయంలో కాలువలో నీరు ఎక్కువగా ప్రవహించడంతో గాలింపునకు అవకాశం లేకుండా పోయింది. పోలీసులు వంశధార ఇంజినీర్లతో మాట్లాడి కాలువలో నీటి ప్రవాహం నిలుపుదల చేయించారు. అనంతరం స్థానిక యువత సాయంతో గాలింపు చర్యలు చేపట్టారు. ప్రమాదం జరిగిన సమీపంలోనే గోవిందరావు మృతదేహం లభ్యమైంది. శవపరీక్షకు పాతపట్నం సామాజిక ఆసుపత్రికి తరలించి అనంతరం కుటుంబ సభ్యులకు అప్పగించారు. కేసు నమోదు చేసినట్లు పోలీసులు పేర్కొన్నారు.

వ్యాన్‌ను ఢీకొన్న ఆర్టీసీ బస్సు

ఆరుగురు ఉపాధ్యాయులకు గాయాలు

పలాస, న్యూస్‌టుడే: పలాస మండలం గరుడఖండి సమీపంలో జరిగిన రోడ్డు ప్రమాదంలో ఆరుగురు ఉపాధ్యాయులకు గాయాలయ్యాయి. విశాఖలో జరిగిన డీఎస్సీ ఆత్మగౌరవ సభకు వెళ్లేందుకు ఉపాధ్యాయులు ఆదివారం ఉదయం కాశీబుగ్గ నుంచి వ్యాన్‌లో బయలుదేరారు. గరుడఖండి సమీపంలో ఇచ్ఛాపురం వైపు వస్తున్న ఆర్టీసీ బస్సు వారి వాహనాన్ని ఢీకొంది. ఈ ప్రమాదంలో మెళియాపుట్టి మండలం భరణికోట కు చెందిన ఎస్.గోపాల్, జి.మోజెస్, పెద్దమడికి చెందిన ఎం.హేమసుందర్, కె.రాజు, జె.సాయికల్యాణి, కవిటి మండలం కరాపాడుకు చెందిన టి.భాస్కరరావు గాయపడ్డారు. వీరిని 108 వాహనంలో పలాస ప్రభుత్వ సామాజికాసుపత్రికి తరలించి ప్రాథమిక చికిత్స అందించారు. మెళియాపుట్టి, పలాస, వజ్రపుకొత్తూరు మండలాలకు చెందిన విద్యాశాఖాధికారులు, యూటీఎఫ్ నాయకులు ఎల్.వెంకటాచలం, జిల్లా కార్యదర్శి కె.రమేష్, ఉపాధ్యాయులు వీరిని పరామర్శించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు కాశీబుగ్గ పోలీసులు తెలిపారు.



పలాస ప్రభుత్వ సామాజికాసుపత్రిలో చికిత్స పొందుతున్న ఉపాధ్యాయులు

రోడ్డు ప్రమాదంలో జూనియర్ లైన్‌మెన్ దుర్మరణం



చుక్క సంతోష్‌దొర (పాతచిత్రం)

శ్రీకాకుళం అర్బన్, న్యూస్‌టుడే: శ్రీకాకుళం నగరం కొత్తరోడ్డు సమీపంలో ఆదివారం ఆర్టీసీ అద్దె బస్సు ఢీకొన్న ఘటనలో ఓ వ్యక్తి మృతి చెందారు. పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. చుక్క సంతోష్ దొర (36) హడ్కో కాలనీలో జూనియర్ లైన్‌మెన్‌గా పని చేస్తున్నారు. కొత్తరోడ్డు వైపు నుంచి శ్రీకాకుళం బస్టాండ్‌కు బస్సు వస్తుండగా, అదే సమయంలో సంతోష్ రోడ్డు దాటుతుండగా ప్రమాదం చోటుచేసుకుంది. ఈ ఘటనలో తలకు బలమైన గాయమై అక్కడికక్కడే మృతిచెందారు. సంతోష్ స్వస్థలం మన్యం జిల్లా వీరఘట్టం మండలం చిన్ని గ్రామం. గత ఆరేళ్లుగా శ్రీకాకుళంలోనే కుటుంబంతో నివాసముంటున్నారు. భార్యతో పాటు ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. శ్రీకాకుళం గ్రామీణ ఎస్సై కె.సురేష్ ఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని సర్వజనాసుపత్రికి పోస్టుమార్టం నిమిత్తం తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

సింగుపురంలో ఇండోర్ స్టేడియం నిర్మించాలి



ఎమ్మెల్యే గొండు శంకర్‌ను కలిసిన బ్యాడ్మింటన్ క్లబ్ సభ్యులు, క్రీడాకారులు

కలెక్టరేట్ (శ్రీకాకుళం), న్యూస్‌టుడే: శ్రీకాకుళం గ్రామీణ మండలం సింగుపురం జడ్పీ ఉన్నత పాఠశాల క్రీడా మైదానంలో బ్యాడ్మింటన్ ఇండోర్ స్టేడియం నిర్మించాలని బ్యాడ్మింటన్ క్లబ్ సభ్యులు, స్థానిక క్రీడాకారులు కోరారు. విశాఖ ఏ కాలనీలోని నియోజకవర్గ కార్యాలయంలో ఎమ్మెల్యే గొండు శంకర్‌ను ఆదివారం కలిసి వినతిపత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ బ్యాడ్మింటన్ ఇండోర్ స్టేడియం అవసరాన్ని ఎమ్మెల్యేకు వివరించారు. దీనిపై ఆయన స్పందిస్తూ ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపి ఇండోర్ స్టేడియం ఏర్పాటుకు కృషి చేస్తామన్నారు. స్థానిక నేతలు పంగ రమేష్, పీడీలు రవి, లక్ష్మణరావు, క్లబ్ సభ్యులు, క్రీడాకారులు పాల్గొన్నారు.

కార్యాలయ ప్రారంభోత్సవానికి తరలిరండి

శ్రీకాకుళం అర్బన్, న్యూస్‌టుడే: వైకాపా కార్యాలయాన్ని శ్రీకాకుళం నగరంలోని టౌన్‌హాల్లో ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడు ధర్మాన కృష్ణదాస్ సోమవారం ప్రారంభించనున్నట్లు పార్టీ మీడియా సమన్వకర్త మండవిల్లి రవి ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. సాయంత్రం 3 గంటలకు ఏడు రోడ్ల కూడలి వద్ద వైఎస్ రాజశేఖరరెడ్డి విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించిన అనంతరం అక్కడి నుంచి టౌన్‌హాల్ వరకు ప్రదర్శన నిర్వహించనున్నట్లు చెప్పారు. మాజీ మంత్రులు ధర్మాన కృష్ణదాస్, ధర్మాన ప్రసాదరావు, సీదిరి అప్పలరాజు, అసెంబ్లీ మాజీ స్పీకర్ తమ్మినేని సీతారాం, పార్టీ రాష్ట్ర పరిశీలకుడు కుంభా రవిబాబు, ఎమ్మెల్సీ నర్తు రామారావు హాజరు కానున్నట్లు పేర్కొన్నారు. కార్యకర్తలు అధిక సంఖ్యలో తరలిరావాలని కోరారు.

సమయానికి చేరలేం.. సమస్యను ఆపలేం



శ్రీకాకుళంరోడ్డు రైల్వేస్టేషన్ సమీపంలోని ఊసవానిపేట కూడలిలో రైల్వే గేటు పడితే తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని వాహనదారులు, ప్రయాణికులు వాపోతున్నారు. ఏ సమయంలో గేటు పడుతుందో, ఎంత సమయం నిరీక్షించాలో తెలియడం లేదని ఆందోళన చెందుతున్నారు. దీంతో సమయానికి గమ్యం చేరలేకపోతున్నామని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇది అలికాం బత్తిలి ప్రధాన రహదారిలో ఉండటంతో నిత్యం అధిక సంఖ్యలో ప్రజలు రాకపోకలు సాగిస్తుంటారు. ఇంతటి ప్రాధాన్యం ఉన్న ఈ మార్గంలో పైవంతెన ఏర్పాటు చేసి సమస్య పరిష్కరించాలని కోరుతున్నారు. రైల్వేస్టేషన్ మేనేజర్ బి.జనార్దనరావు వద్ద విషయం ప్రస్తావించగా పైవంతెన ఏర్పాటుకు అనుమతులు వచ్చాయని, త్వరలోనే పనులు ప్రారంభమవుతాయని తెలిపారు. – న్యూస్‌టుడే, ఆమదాలవలస పట్టణం

ప్రాథమిక స్థాయి నుంచే వృత్తిపరమైన శిక్షణ



ప్రశంసాపత్రాన్ని అందుకుంటున్న రాష్ట్ర ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీత నీరజకుమారి

కలెక్టరేట్ (శ్రీకాకుళం), న్యూస్‌టుడే: ఫిన్లాండ్‌లో ప్రాథమిక విద్యకు అధిక ప్రాధాన్యం ఇస్తున్నట్లు రాష్ట్ర ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీత తిమ్మరాజు నీరజ కుమారి తెలిపారు. ఈ నెల 17 నుంచి 26వ తేదీ వరకు ఫిన్లాండ్‌లోని తుర్క్ యూనివర్సిటీలో విద్యావ్యవస్థపై అధ్యయనానికి వెళ్లిన నీరజకుమారి జిల్లాకు తిరిగి వచ్చిన సందర్భంగా మాట్లాడారు. 'క్షేత్ర స్థాయి పర్యటనలో అక్కడ విద్యాప్రమాణాలను పరిశీలించాం. జాయ్ అండ్ ప్లే వినూత్న పద్ధతుల ద్వారా పూర్వ ప్రాథమిక, ప్రాథమిక స్థాయి విద్యలో వృత్తిపరమైన శిక్షణలు ఇస్తున్నారు. పాఠ్యప్రణాళికలో సంస్కరణలు తీసుకొస్తున్నారు. ఒకేషనల్ శిక్షణలు, రౌమాలోని టీచర్స్ ట్రైనింగ్‌లను కూడా పరిశీలించాం. రెండు దశల్లో శిక్షణలను పూర్తి చేయడంతో రాష్ట్ర విద్యాశాఖ కమిషనర్ తమీమ్ అన్సారియా, తుర్క్ విశ్వవిద్యాలయ అంతర్జాతీయ విద్యాభివృద్ధి ప్రతినిధులు సింజాయ్, సారి ఐసోక్యోటో, సువి పువోలక్క చేతుల మీదుగా ప్రశంసాపత్రాన్ని అందుకున్నాం' అని వివరించారు.

గట్కా రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపిక



గట్కా జిల్లా స్థాయి పోటీలు నరసన్నపేట ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ఆదివారం జరిగాయి. ఇందులో మొత్తం 55 మంది క్రీడాకారులు పాల్గొనగా.. వారిలో 46 మంది రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికయ్యారు. జిల్లా గట్కా అసోసియేషన్ అధ్యక్షుడు బి.ఖగేశ్వరరావు ఆధ్వర్యంలో జరిగిన పోటీల్లో విజేతలకు తెదేపా రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి బగ్గు అర్చన అభినందించారు.

– న్యూస్‌టుడే, నరసన్నపేట

ఆదిత్యుని ఆదాయం రూ.5.65 లక్షలు

శ్రీకాకుళం అర్బన్, న్యూస్‌టుడే: అరసవల్లి సూర్యనారాయణ స్వామి ఆలయానికి శ్రావణమాసం మూడో ఆదివారం కావడంతో రద్దీ పెరిగింది. భక్తుల తాకిడి పెరగడంతో ఆదివారం ఒక్క రోజే వివిధ రూపాల్లో రూ.5.65 లక్షల ఆదాయం సమకూరింది. టికెట్ల విక్రయాల ద్వారా రూ.2,44,500, పూజలు, విరాళాల రూపంలో రూ. 49,788, ప్రసాదాల నుంచి రూ. 1,10,225, ఆన్‌లైన్ టికెట్ల అమ్మకం ద్వారా రూ.1,60,664 ఆదాయం సమకూరినట్లు ఆలయ ఈవో కేఎన్ వీడీవీ ప్రసాద్ తెలిపారు.



గోసేవా ఆశ్రమంలో అన్నమయ్య కీర్తనలు

రణస్థలం, న్యూస్‌టుడే: కోష్ట సమీపంలోని ఎస్‌కేసీఎం గోసేవా ఆశ్రమంలో శ్రీకృష్ణ జన్మాష్టమిని పురస్కరించుకుని వేడుకలు ఘనంగా నిర్వహిస్తున్నారు. ఆదివారం అన్నమయ్య కీర్తనలు ఆలపించారు. అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

చికెన్ ధరలు

రకం (కిలో రూ.ల్లో..)	(బ్యాగ్)లైవ్	డ్రెస్డ్	స్కిన్‌లెస్
బ్రాయిలర్	150	255	275

భయం వీడు.. యాప్ తోడు

బాలలకు రక్షణగా పోక్సో ఈ- బాక్స్

ముకోసం

– న్యూస్‌టుడే, శ్రీకాకుళం నేరవార్తా విభాగం, గార

అభం శుభం తెలియని బాలబాలికలపై ఇటీవల కాలంలో అఘాయిత్యాలు పెరిగిపోయాయి. కుటుంబ సభ్యులు, చుట్టు పక్కల నివసించే వారు, తెలిసిన వారు, పాఠశాలల్లో సిబ్బంది ఇలాంటి ఘటనలకు పాల్పడుతున్నారు. ఇవి జరిగినప్పుడు కొందరు సమాజంలో ఇబ్బందులకు గురవుతామని, మరి కొందరు నిందితులకు భయపడో, పరువు పోతుందనో విషయాన్ని బయటకు వెల్లడించడం లేదు. తల్లిదండ్రులు, బంధువులు సైతం గోప్యత పాటిస్తున్నారు. పోలీసులకు, అధికారులకు ఫిర్యాదు చేసేందుకు ముందుకు రావడం లేదు. ఇదే అలుసుగా తీసుకుని మృగాళ్లు మరింత రెచ్చిపోతున్నారు. ఇలాంటి ఘటనల్లో బాధితులకు అండగా నిలవడానికి ప్రభుత్వం కొత్త విధానాన్ని అందుబాటులోకి తీసుకొచ్చింది. జాతీయ బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ (ఎన్‌సీపీసీఆర్) పోక్సో ఈ-బాక్స్ పేరుతో యాప్‌ను తెచ్చింది. దీని ద్వారా హింస స్వభావాన్ని తెలియజేసేందుకు వీలు కల్పించింది.

ఎలా తెలపాలంటే..

చరవాణిలో గూగుల్ ప్లేస్టోర్ నుంచి పోక్సో ఈ- బాక్స్ యాప్‌ను డౌన్‌లోడ్ చేసుకుని ఇన్‌స్టాల్ చేసుకోవాలి. యాప్‌ను తెరవగానే వృత్తాకారంలో ఈ- బాక్సు కనిపిస్తుంది. దీనిపై క్లిక్ చేస్తే చిన్నారులకు ఎదురయ్యే ఆరు రకాల సమస్యలు చిత్రాలతో సహా కనిపిస్తాయి. 1) క్రీడా ప్రాంగణం, దుకాణం, రహదారిపై 2) పాఠశాల, ప్రైవేటు ప్రదేశం, 3) బ్లాక్‌మెయిల్, 4) స్కూల్‌బస్, వ్యాన్, 5) కుటుంబ సభ్యులు, బంధువులు, ఇతరులు, 6) ఇంటర్నెట్, ఫోన్‌లలో ఏ విభాగంలో అఘాయిత్యం ఎదురైందో హింస స్వభావం తెలుపుతూ దానిపై క్లిక్ చేసి సబ్‌మిట్ కొట్టాలి. www.ncper.gov.in వెబ్‌సైట్లో నూ ఫిర్యాదు చేసేందుకు వీలుంది.

వివరాలు గోప్యం

18 ఏళ్ల వయసు లోపు వారిని బాలలుగా పరిగణిస్తారు. అలాంటి వారికి ఏదైనా ఇబ్బంది తలపెడితే విద్యాహక్కు చట్టం- 2009, పోక్సో చట్టం- 2012, బాలల న్యాయచట్టం- 2015ను అనుసరించి చట్టపరమైన చర్యలు తీసుకుంటారు. యాప్ ద్వారా వచ్చిన ఫిర్యాదులను సంబంధిత అధికారులకు పంపిస్తారు. వీటిపై బాలల సంరక్షణ సిబ్బంది వెంటనే స్పందించి విచారణ జరిపి బాధితులకు న్యాయం జరగడానికి సహకరిస్తారు. ఫిర్యాదుదారుల వివరాలను గోప్యంగా ఉంచుతారు.

హిరమండలం కేజీబీవీ ప్రిన్సిపల్‌గా రాధిక

కలెక్టరేట్(శ్రీకాకుళం), న్యూస్‌టుడే: హిరమండలం కస్తూర్బా విద్యాలయ ప్రిన్సిపల్‌గా రాధికను నియమిస్తూ కలెక్టర్ ఉత్తర్వులు జారీ చేశారు. హిరమండలంలో పనిచేస్తున్న ప్రిన్సిపల్ గాయత్రిని కొత్తూరు కేజీబీవీకి బదిలీ చేశారు. కొత్తూరులో పనిచేస్తున్న సమయంలో ఆరోపణలు ఎదుర్కొనడంతో అప్పట్లో రాధికను తొలగించారు. తిరిగి కోర్టు ఉత్తర్వుల మేరకు విధుల్లోకి తీసుకున్నారు.

జిల్లా మాస్టర్స్ అథ్లెటిక్స్ సంఘ కార్యవర్గం ఎన్నిక



జిల్లా మాస్టర్స్ అథ్లెటిక్స్ సంఘ కార్యవర్గం ఎన్నికలు ఆదివారం శ్రీకాకుళం నగరంలోని ఎన్జీవో హోంలో జరిగాయి. సంఘ రాష్ట్ర నిర్వాహక కార్యదర్శి బి.రామ్‌కుమార్, సంయుక్త కార్యదర్శి వి.ఎ.భాస్కర్ పర్యవేక్షణలో సర్వసభ్య సమావేశం నిర్వహించారు. అనంతరం జిల్లా నూతన అధ్యక్షుడిగా బి.నారాయణరావు, నిర్వాహక అధ్యక్షురాలిగా ఎం.భాగ్యలక్ష్మి, ఉపాధ్యక్షులుగా ఎ.ఈశ్వరరావు, కె.రాజారావు, బి.నిర్మలాకృష్ణ, ప్రధాన కార్యదర్శిగా సీహెచ్.జగదీష్, కోశాధికారిగా ఒ.శ్రీనివాసరావు, నిర్వాహక, సంయుక్త కార్యదర్శులుగా టి.ఆనందరావు, డి.యశోద, ఎగ్జిక్యూటివ్ సభ్యుడిగా రవిలను ఎన్నుకున్నారు. – న్యూస్‌టుడే, పాతబస్టాండ్

పూజిత కుటుంబాన్ని ఆదుకోండి



మంత్రి అచ్చెన్నాయుడికి సమస్యను వివరిస్తున్న జేఏసీ నేతలు

ఎత్తురాళ్లపాడు(కోటబొమ్మాళి), న్యూస్‌టుడే: పాతపట్నం అంబేడ్కర్ గురుకుల వసతి గృహంలో ప్రమాదవశాత్తు మృతిచెందిన విద్యార్థిని చింతాడ పూజిత కుటుంబానికి ప్రభుత్వ సాయం అందించాలని జిల్లా దళిత సంఘాల జేఏసీ నాయకులు విన్నవించారు. ఈ మేరకు ఆదివారం నిమ్మాడ కార్యాలయంలో ఉన్న మంత్రికి వినతిపత్రం అందజేశారు. జేఏసీ కన్వీనర్ కంఠవేణు, ప్రధాన కార్యదర్శి తైక్వాండో శ్రీను మంత్రికి వివరిస్తూ ఆర్థికసాయం అందించాలని కోరారు.

పలాస

• పలాస • ఇచ్ఛాపురం

సంపద లేదు.. చెత్త సమస్య తీరదు..!



వజ్రపుకొత్తూరు మండలంలోని ప్రధాన కూడళ్లలో చెత్త పేరుకుపోతోంది. ప్రత్యేకాధికారుల పాలనలో పర్యవేక్షణ కరవై సమస్య అధికమవుతోంది. పూండి నుంచి పాతటెక్కలి మధ్య మెట్టుపల్లి ప్రధాన కూడలి వద్ద స్థానికులు నేరుగా చెత్తను రోడ్లపై వేస్తున్నారు. గోవిందపురం, యాజీపురం పంచాయతీల పరిధిలో చెత్త సంపద కేంద్రాలు లేకపోవడంతో ఎక్కడికక్కడ నిల్వలు పేరుకుపోతున్నాయి. అక్కడ కుక్కలు, పందులు బీభత్సం సృష్టిస్తుండటంతో వాహనదారులు ప్రమాదాలకు గురవుతున్నారు. మరోవైపు ప్రజలు రోగాలు బారిన పడుతున్నారు. దీనిపై ఎంపీడీవో రమేశ్‌నాయుడును వివరణ కోరగా అవసరమైన చర్యలు తీసుకుంటామన్నారు. – న్యూస్‌టుడే, వజ్రపుకొత్తూరు గ్రామీణం

రేపు విద్యుత్తు సరఫరాలో అంతరాయం

కవిటి గ్రామీణం, న్యూస్‌టుడే: కవిటి మండలం మాణిక్యపురం ఫీడర్ పరిధిలో మరమ్మతు పనుల నిమిత్తం మంగళవారం పలు గ్రామాల్లో విద్యుత్తు సరఫరా నిలిచిపోనుందని పలాస విద్యుత్తు శాఖ ఈఈ యజ్ఞేశ్వరరావు తెలిపారు. ఈ మేరకు బి.గొనకపుట్టుగ, వరక, కుసుంపురం, బల్లిపుట్టుగ, మాణిక్యపురం పంచాయతీ పరిధిలోని గ్రామాలకు ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు సరఫరా ఉండదని, గృహ, వ్యవసాయ వినియోగదారులు సహకరించాలని కోరారు.

సామాజిక అంశాలే రచయితలకు అస్త్రాలు

హరిపురం (మందస), న్యూస్‌టుడే: రచయితలు సామాజిక అంశాలనే అస్త్రాలుగా సంధించాలని వక్తలు సూచించారు. హరిపురంలో ప్రజా సంఘాల ఐక్య వేదిక ఆధ్వర్యంలో డీటీఎఫ్ జిల్లా గౌరవాధ్యక్షుడు పేడాడ కృష్ణారావు రచించిన 'ఈ అడుగులు ఏ ప్రస్థానానికి..?' పుస్తక పరిచయ సభ ఆదివారం నిర్వహించారు. ఈ పుస్తకంలో ప్రతి వ్యాసం నేటి విద్యార్థులకు, పోటీ పరీక్షలకు సన్నద్ధమయ్యే అభ్యర్థులకు ఉపయోగపడుతుందన్నారు. దేశంలో జరుగుతున్న పరిణామాలకు ఈ పుస్తకం ప్రతిబింబం లాంటిదని పౌర హక్కుల సంఘం రాష్ట్ర సహాయ కార్యదర్శి పి.దానేసు అన్నారు. ప్రస్తుత పరిణామాల దృష్ట్యా ఐక్య ఉద్యమాలు అనివార్యమని కుల నిర్మూలన పోరాట సమితి రాష్ట్ర ఉపాధ్యక్షుడు మిస్క కృష్ణయ్య పిలుపునిచ్చారు. యు.సోమనాథం, ఎం.కోదండరావు, ఎం.మాధవరావు, పి.దుర్యోధన, ఎస్.వీరాస్వామి తదితరులు పాల్గొన్నారు.



'ఈ అడుగులు ఏ ప్రస్థానానికి..?' పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న వక్తలు

తెరపై ఈనాడు

పలాసలో.. ఎస్వీ మ్యాక్స్: విశ్వనాథ్ అండ్ సన్స్, హరిశంకర్: ఇరుముడి, భాస్కరరామ: టాక్సిక్, ఇచ్ఛాపురంలో.. పూర్ణ: టాక్సిక్, మణికంఠ ఎల్‌మ్యాక్స్: ఇరుముడి, సోంపేటలో.. ఎస్ఎస్‌మ్యాక్స్: టాక్సిక్, శివ: ఇరుముడి – న్యూస్‌టుడే, పలాస, కాశీబుగ్గ, ఇచ్ఛాపురం, సోంపేట

అధ్వాన దారులు.. ప్రమాదకర మలుపులు

– న్యూస్‌టుడే, ఇచ్ఛాపురం గ్రామీణం



పూర్ణాటకం నుంచి ఈదుపురం వెళ్లే రోడ్డులో పరిస్థితి

ఇచ్ఛాపురం నియోజకవర్గంలో పలు ప్రాంతాల్లో రోడ్లు అధ్వానంగా దర్శనమిస్తున్నాయి. ఈ మార్గాల్లో కొన్ని చోట్ల ఉన్న మలుపులు ప్రమాదాలకు నిలయాలుగా మారుతున్నాయి. ఆయా ప్రాంతాల్లో వేగ నియంత్రికలు, సూచిక బోర్డులు లేకపోవడం కూడా వాహనదారులకు శాపంగా మారుతోంది. మరికొన్ని ప్రాంతాల్లో మలుపుల వద్ద రోడ్డుకు ఇరువైపులా పనికిరాని మొక్కలు పెరగడంతో ఎదురుగా వచ్చే వాహనాలు కనిపించక ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయి. ఈ ఘటనల్లో పలువురు మృత్యువాత పడుతుండగా.. చాలా మంది గాయాల బారిన పడి అవయవాలను కోల్పోతున్నారు.

ఎక్కడెక్కడ: ఇచ్ఛాపురం మండలం బలరాంపురం, పూర్ణాటకం, బూర్జపాడు, బాలకృష్ణాపురం, కేశుపురం, జగన్నాథపురం, కవిటి మండలం ముత్యాలపేట, కవిటి రోడ్డు, రాజపురం, బైరిపురం, కంచిలి మండలం కత్తివరం, మకరాంపురం, రేఖాదేవిపురం నుంచి ముండ్ల గ్రామానికి వెళ్లే రహదారి, సోంపేట మండలం కుత్తుమ రోడ్డు, ఇసకలపాలెం, రుషికుద్ద తదితర ప్రాంతాల కూడళ్ల వద్ద భారీ మలుపులున్నాయి.



కేశుపురం సమీపంలో మలుపు వద్ద రహదారి దుస్థితి

హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేయాలి

మారుమూల గ్రామాలకు వెళ్లే ప్రతి రహదారీ మలుపులతో కూడుకున్నదే. అక్కడ రోడ్డు బాగోకపోవడం, ఇరువైపులా పనికిరాని మొక్కలు, పొదలు పెరగడంతో ఎదురుగా వచ్చే వాహనాలను ఢీకొని పలువురు ప్రాణాలు కోల్పోతున్నారు. ఆయా మలుపుల వద్ద హెచ్చరిక బోర్డులు కూడా ఏర్పాటు చేయలేని పరిస్థితి.

◆ మూడేళ్ల కిందట జగన్నాథపురం వద్ద మలుపులో జరిగిన ప్రమాదంలో ఓ యువకుడు మృతి చెందాడు.

◆ నాలుగేళ్ల కిందట ఇన్నేసుపేట సమీపంలోని మలుపు వద్ద జరిగిన ప్రమాదంలో ఓ యువకుడు మృత్యువాత పడ్డాడు.

చర్యలు తీసుకుంటాం: మలుపుల వద్ద వేగ నియంత్రణలతోపాటు సూచిక బోర్డులు ఏర్పాటు చేస్తాం. పనికిరాని మొక్కలు తొలగిస్తాం. పాడైన రహదారులకు మరమ్మతులు చేపట్టేందుకు చర్యలు తీసుకుంటాం. - **ధనంజయరావు, జేఈ, పంచాయతీ రాజ్ శాఖ**

మేమున్నాం.. మీకు తోడుగా

(10 AM TO 1 PM) 8008574279 9063144707

మీ ప్రాంతంలో ఏ ప్రజా సమస్యనైనా పరిష్కరించే క్రమంలో 'ఈనాడు' మీకు తోడుగా ఉంటుంది. వివరాలు, చిత్రాలను వాట్సప్ ద్వారా పంపొచ్చు. ఫోన్లో వివరించొచ్చు. వాటిని బాధ్యుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి కృషి చేస్తాం.

సమస్య : ఇచ్ఛాపురం పట్టణంలో ద్విచక్రవాహనాలపై ముగ్గురేసి వ్యక్తులు కూర్చుని చరవాణిలో మాట్లాడుతూ, వేగంగా బండి నడుపుతూ ప్రమాదకర ప్రయాణాలు చేస్తున్నారు. - **డా.నిత్యానంద పట్నాయక్, ఇచ్ఛాపురం** సమాధానం : తరచూ తనిఖీలు చేస్తూ జరిమానా విధిస్తున్నాం. మళ్లీ మళ్లీ అదే తప్పిదం చేస్తే కేసులు నమోదు చేస్తాం.

- **ఎం.ముకుందరావు, పట్టణ ఎస్సై, ఇచ్ఛాపురం** – న్యూస్‌టుడే, ఇచ్ఛాపురం

? టెక్కలిపట్నంలోని ప్రధాన వీధిలో ఆరు వీధి దీపాలు నిత్యం వెలుగుతూనే ఉన్నాయి. - **స్థానికులు** ★ దీపాలు రాత్రి పూట మాత్రమే వెలిగేలా చర్యలు తీసుకుంటాం. - **రవి, పంచాయతీ అభివృద్ధి అధికారి, టెక్కలిపట్నం** – న్యూస్‌టుడే, పలాస గ్రామీణం

మురుగు కదిలింది

రత్తకన్న సంతోషివీధిలో మురుగు కాలువలు శుభ్రం చేశారు. ఈ వీధి కాలువలో పూడిక తీయక దుర్వాసనతో ఇబ్బంది పడుతున్నామని స్థానికులు 'ఈనాడు' 'మేమున్నాం.. మీకు తోడుగా' ద్వారా పురాధికారులకు నివేదించగా.. కమిషనర్ నల్లి రమేష్ స్పందించారు. పుర పారిశుద్ధ్య అధికారి పి.ఉపేంద్రకుమార్ పర్యవేక్షణలో సమస్య పరిష్కారానికి చర్యలు చేపట్టారు. – న్యూస్‌టుడే, ఇచ్ఛాపురం

శిథిలమైన పై కప్పు.. తప్పదు ముప్పు



బూర్జపాడు, నెలవంక కూడలి మలుపు వద్ద రోడ్డుకు ఆనుకొని ఉన్న కాలువ పైకప్పు శిథిలావస్థకు చేరింది. నెలలుగా ఇదే పరిస్థితి నెలకొన్నా ఎవరూ పట్టించుకోవడం లేదు. దీంతో చిన్నారులు, పాదచారులు, వాహనదారులు ప్రమాదాలకు గురవుతున్నారని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. మరమ్మతులు చేపట్టాలని కోరుతున్నారు. పంచాయతీ కార్యదర్శి సంతోష్‌కుమార్‌ను వివరణ కోరగా పరిశీలించి చర్యలు తీసుకుంటామన్నారు. – న్యూస్‌టుడే, ఇచ్ఛాపురం గ్రామీణం

నిత్య వెలుగులు.. అధిక బిల్లులు

కేశుపురం సమీపంలో విద్యుత్తు దీపాలు నిత్యం వెలుగుతున్నాయి. పంచాయతీకి అధిక బిల్లులు రావడంతో పాటు చాలా రోజులుగా ఇదే పరిస్థితి నెలకొనడంతో వేగంగా పాడయ్యే అవకాశం ఉందని స్థానికులు మండి పడుతున్నారు. అధికారులు స్పందించి చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు. దీనిపై ఏఈ గోవిందరావును వివరణ కోరగా సమస్య తమ దృష్టికి రాలేదని, పరిశీలించి చర్యలు తీసుకుంటామన్నారు. – న్యూస్‌టుడే, ఇచ్ఛాపురం గ్రామీణం



చెరువు కాదు.. రోడ్డే



ఇటీవల కురిసిన చిన్నపాటి వర్షాలకు డొంకూరు ప్రధాన రహదారి చెరువులా మారింది. దీంతో స్థానికులు, సముద్ర తీరానికి వెళ్లే వారు రాకపోకలకు ఇబ్బందులు పడుతున్నారు. రోడ్డుకు ఇరువైపులా కాలువ వ్యవస్థ లేకపోవడంతో ఈ పరిస్థితి నెలకొందని గ్రామస్థులు వాపోతున్నారు. దీనిపై పంచాయతీ కార్యదర్శి సంతోష్‌కుమార్‌ను వివరణ కోరగా సంబంధిత అధికారులు దృష్టికి తీసుకెళ్లి సమస్య పరిష్కారానికి కృషి చేస్తామన్నారు. – న్యూస్‌టుడే, ఇచ్ఛాపురం గ్రామీణం

అడుగు తడబడితే ఆసుపత్రికే

డబ్బూరివీధి కూడలిలో కల్వర్టు చివర భాగాన్ని నిర్లక్ష్యంగా వదిలేశారు. అది ప్రమాదకరంగా మారింది. దీనికి ఒకవైపు బడి, మరో వైపు గుడి ఉన్నాయి. నిత్యం జనం రాకపోకలు సాగిస్తుంటారు. వాహనం అదుపు తప్పినా, అడుగులు తడబడినా మురుగు కాలువలో పడిపోతున్నామని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఈ విషయాన్ని ఏఈ కిశోర్ వద్ద ప్రస్తావించగా పరిశీలించి సమస్యను పరిష్కరిస్తామన్నారు. – న్యూస్‌టుడే, ఇచ్ఛాపురం



మర్రి చెట్టు పడింది.. నీరు ఆగింది



కవిటి మండలం బైరిపురం సమీపంలో ఉద్దానం ప్రాజెక్టు ద్వారా పలు గ్రామాలకు నీరందించే ట్యాంకుపై మర్రి చెట్టు పడింది. పైపులు పాడవ్వడంతో కొన్ని గ్రామాలకు నీరు అందడం లేదు. దీంతో ఆయా గ్రామాల ప్రజలు తాగునీటికి ఇబ్బందులు పడుతున్నారు. దీనిపై ఉద్దానం ఏఈ ఆర్.చైతన్య కుమార్‌ను వివరణ కోరగా ప్రజలకు ఎలాంటి ఇబ్బంది లేకుండా చర్యలు తీసుకున్నామని, అన్ని గ్రామాలకు నీరు అందిస్తున్నామన్నారు. – న్యూస్‌టుడే, కవిటి గ్రామీణం

క్రమశిక్షణతోనే ఉన్నత లక్ష్యాలు

క్రమశిక్షణతో కూడిన విద్యను అలవర్చుకుంటే ఉన్నత లక్ష్యాల వైపు పయనించొచ్చని విశ్రాంత డిప్యూటీ డీఎంహెచ్‌వో కె.లీలా అన్నారు. పూండి సాయివినీత్ జూనియర్ కళాశాలలో ప్రిన్సిపల్ కైలాసరావు నేతృత్వంలో ఆదివారం స్వాగతోత్సవాలు నిర్వహించారు. ఉద్దానం యువత అన్ని రంగాల్లో రాణించాలని ఆకాంక్షించారు. ఈ సందర్భంగా ప్రదర్శించిన విద్యార్థుల నృత్యాలు ఆకట్టుకున్నాయి. విద్యాసంస్థల అధినేత కోదండరావు, వైస్ ప్రిన్సిపల్ సాయిగోపాల్, శ్రీనివాసరావు పాల్గొన్నారు. – న్యూస్‌టుడే, వజ్రపుకొత్తూరు గ్రామీణం



అలరించిన విద్యార్థినుల నృత్యాలు



మాట్లాడుతున్న విశ్రాంత డిప్యూటీ డీఎంహెచ్‌వో లీలా

అభ్యసన నైపుణ్యాలతో మంచి భవిష్యత్తు

విద్యార్థులు అభ్యసన నైపుణ్యాలు అలవర్చుకోవడం ద్వారా మంచి భవిష్యత్తు ఏర్పర్చుకోవచ్చని మనోవికాస నిపుణుడు రాంబుడ్డి గణపతి అన్నారు. కొర్లాం బాలకృష్ణ జూనియర్ కళాశాలలో ప్రిన్సిపల్ డి.లక్ష్మణరావు అధ్యక్షతన ఆదివారం స్వాగతోత్సవాలు జరిగాయి. ఈ సందర్భంగా గణపతి మాట్లాడుతూ విద్యార్థి దశను నిర్లక్ష్యం చేయొద్దని హితవు పలికారు. మార్కులు, చదువులు కాకుండా నైపుణ్యాలను అభివృద్ధి చేసుకోవాలని వక్తలు సూచించారు. విద్యార్థుల నృత్యాలు, సాంస్కృతిక ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. – న్యూస్‌టుడే, సోంపేట



పేదలకు అండగా సీఎం సహాయనిధి

పలాస, న్యూస్‌టుడే: కూటమి ప్రభుత్వం పేదలను ముఖ్యమంత్రి సహాయనిధి ద్వారా ఆదుకుంటోందని పలాస ఎమ్మెల్యే గౌతు శిరీష అన్నారు. పలాస తెదేపా కార్యాలయంలో ఆదివారం సీఎం సహాయనిధి చెక్కులు అందజేశారు. ఎస్.లక్ష్మి కుటుంబీకులకు రూ.81 వేలు, సీహెచ్.వెంకటేశ్ కుటుంబానికి రూ.1.42 లక్షల విలువైన చెక్కులు అందజేశారు. తెదేపా నాయకులు జి.పాపారావు, టి.అప్పోజి, సీహెచ్.నారాయణ తదితరులు పాల్గొన్నారు.



చెక్కు అందజేస్తున్న ఎమ్మెల్యే శిరీష

కూటమి ప్రభుత్వంలో అభివృద్ధి శూన్యం

పలాస, న్యూస్‌టుడే: కూటమి హయాంలో అభివృద్ధి శూన్యమని మాజీ మంత్రి సీదిరి అప్పలరాజు అన్నారు. కాశీబుగ్గలో ఆదివారం విలేకర్ల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆఫ్‌షోర్ రిజర్వాయర్ ఘనత దివంగత హనుమంతు అప్పయ్యదొరకు దక్కుతుందని, వైకాపా హయాంలోనే పనులు జరిగాయన్నారు. పలాస-కాశీబుగ్గ పురపాలక సంఘంలో తాగునీటి సమస్య పరిష్కారానికి రూ.110 కోట్లు మంజూరు చేశామన్నారు. ఇచ్ఛాపురం, పలాస నియోజకవర్గాల్లో తాగునీరు అందించేందుకు రూ.700 కోట్లతో మంచినీటి పథకం ఏర్పాటు చేశామని పేర్కొన్నారు. పలాస-కాశీబుగ్గ పురపాలక సంఘం, మందసలో రోడ్డు విస్తరణ చేపట్టి ప్రజలకు ఇబ్బంది లేకుండా చేశామన్నారు. వైకాపా హయాంలోనే మూలపేట నిర్మాణం జరిగిందని, ఈ అభివృద్ధి అంతా కూటమి ప్రభుత్వం కోటాలో వేసుకోవడం హాస్యాస్పదంగా ఉందన్నారు. బొడ్డపాడు రెవెన్యూ పరిధిలో 150 ఎకరాల్లో ఎంఐజీ లేఅవుట్, 2,500 మందికి జగనన్న కాలనీ ద్వారా ఇళ్లు కేటాయించిన ఘనత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికే దక్కుతుందన్నారు. ప్రస్తుత ఎమ్మెల్యే గౌతు శిరీష నియోజకవర్గంలో ఏం అభివృద్ధి చేశారో చెప్పగలరా అంటూ సవాల్ విసిరారు. నియోజకవర్గంలో మంచిపాలన అందించాలని కోరారు.



మాట్లాడుతున్న మాజీ మంత్రి అప్పలరాజు

ధనరాజ తులసమ్మకు ప్రత్యేక పూజలు

ఇచ్ఛాపురం మండలం లొద్దపుట్టి కూడలి వద్ద కొలువైన ధనరాజతులసమ్మకు ఆదివారం భక్తులు ప్రత్యేక పూజలు చేశారు. వేకువజామున మహిళలు పసుపు నీటితో అభిషేకించి కుంకుమ, సింధూరంతో పూజలు చేసి రజిత ముఖాన్ని అమ్మవారికి అలంకరించారు. అమ్మవారి దర్శనానికి ఒడిశాతోపాటు చుట్టు పక్కల ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులు బారులు తీరారు. గ్రామ చల్లదనం కోసం వివిధ ప్రాంతాల వారు అమ్మవారికి ఘటాలు సమర్పించారు. – న్యూస్‌టుడే, ఇచ్ఛాపురం గ్రామీణం



రైలు నుంచి జారిపడి మహిళకు గాయాలు

కాశీబుగ్గ, న్యూస్‌టుడే: పలాస రైల్వే జీఆర్పీ పరిధిలో రైలు నుంచి జారిపడి ఓ మహిళ గాయపడ్డారని రైల్వే పోలీసులు తెలిపారు. అసోంకు చెందిన అజ్మినాఖాన్ హైదరాబాద్ నుంచి కోల్‌కతాకు ఫలక్‌నామా ఎక్స్‌ప్రెస్‌లో ప్రయాణిస్తుండగా ఆదివారం పలాస రైలు నిలయం ఆవరణలో జారిపడిపోయారు. తీవ్రగాయాలైన మహిళకు 108 వాహన సిబ్బంది సత్యం, వెంకటరావు ప్రాథమిక చికిత్స అందించి పలాస ప్రభుత్వ సామాజిక ఆసుపత్రిలో చేర్పించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు రైల్వే పోలీసులు తెలిపారు.

ఉత్తమ సేవలతోనే గుర్తింపు


మందస, న్యూస్‌టుడే: ఉద్యోగులకు వారు చేసిన సేవలే గుర్తింపునిస్తాయని డీసీవో వై.యశోదలక్ష్మి అన్నారు. మందసలోని సాంఘిక సంక్షేమశాఖ బీఆర్ అంబేడ్కర్ గురుకుల బాలికోన్నత పాఠశాల, జూనియర్ కళాశాలలో ప్రిన్సిపల్ ఎల్.లక్ష్మి ఉద్యోగ విరమణ కార్యక్రమం ఆదివారం జరిగింది. ఈ సందర్భంగా ఆమె సేవలను డీసీవో కొనియాడారు. అనంతరం ప్రిన్సిపల్ దంపతులను సన్మానించారు. ఈ కార్యక్రమంలో అధ్యాపకులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



ప్రిన్సిపల్ లక్ష్మి దంపతులను సత్కరిస్తున్న డీసీవో యశోదలక్ష్మి

చారిత్రక భవనం.. పట్టించుకోకుంటే ప్రమాదం

ప్రస్తుత ఇచ్ఛాపురం తహసీల్దారు కార్యాలయ భవనాన్ని బ్రిటిష్ కాలంలో కచేరీ కార్యాలయంగా వినియోగించేవారు. ఆపై యూనియన్, రెవెన్యూ కార్యాలయాల నుంచి నేడు వినియోగిస్తున్న తహసీల్దారు కార్యాలయం వరకు సేవలు మారుతున్నా భవనం మారలేదు. పటిష్ఠమైన గోడలతో ఉన్న దీన్ని తాత్కాలిక మరమ్మతులతోనే వినియోగిస్తున్నారు. పైన పెరుగుతున్న మర్రి, రావి తదితర మొక్కలను తొలగించడం లేదు. వాటి వేర్లు గోడల్లో చొచ్చుకుని భవనాన్ని బలహీన పరుస్తున్నాయి. దీంతో ఎప్పుడు ఏ ప్రమాదం సంభవిస్తుందోనని సిబ్బంది, అక్కడి వచ్చే ప్రజలు ఆందోళన చెందుతున్నారు. సమస్యను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి వారి ఆదేశాల మేరకు అవసరమైన చర్యలు తీసుకుంటామని తహసీల్దారు వెంకటరావు తెలిపారు. – న్యూస్‌టుడే, ఇచ్ఛాపురం



పదేళ్లుగా పనులు.. తప్పని ఇక్కట్లు

– న్యూస్‌టుడే, సోంపేట



అధ్వానంగా లక్కవరం రహదారి

సోంపేట-బారువ రోడ్డు నుంచి లక్కవరం మీదుగా జాతీయరహదారి వరకు నిర్మించతలపెట్టిన రోడ్డు పదేళ్లు దాటినా పూర్తికాలేదు. 2017లో గత తెదేపా హయాంలో ఈ రహదారి పనులు ప్రారంభించారు. అంచెలంచెలుగా నిర్వహించిన పనులతో మెటల్ రోడ్డు పూర్తి చేయగా ప్రభుత్వం మారిపోయింది. వైకాపా ప్రభుత్వం ఈ రోడ్డును పట్టించుకోకపోవడంతో పనులు నిలిచిపోయాయి. కూటమి ప్రభుత్వం వచ్చిన తరువాత సోంపేట-బారువ రోడ్డు నుంచి లక్కవరం వరకు సీసీ రోడ్డు నిర్మించి మిగిలిన భాగాన్ని వదిలేశారు. దీంతో లక్కవరం నుంచి జాతీయ రహదారి వరకు రోడ్డుపై రాళ్లు తేలి గోతులు ఏర్పడ్డాయి. గుత్తేదారుకు బిల్లులు చెల్లించకపోవడంతో ఈ పనులు అర్ధాంతరంగా నిలిచిపోయాయి.

★ లక్కవరం వరకు ఇతర నిధులతో పనులు చేపట్టి మిగిలిన భాగం వదిలేయడంతో సోంపేట, బెంకిలి, జింకిభద్ర, పలాసపురం పంచాయతీలతోపాటు ఉద్దానం గ్రామాల ప్రజలు జాతీయ రహదారి మీదుగా పలాస వైపు వెళ్లేందుకు ఇబ్బందులు పడుతున్నారు. ఇప్పటికైనా రహదారి పనులు పూర్తిచేసి ఇబ్బందులు తీర్చాలని ఆయా గ్రామాల ప్రజలు కోరుతున్నారు. పీఐయూ ఏఈ ధనంజయ్‌ను వివరణ కోరగా రహదారి నిర్మాణం విషయమై ప్రభుత్వానికి నివేదిక పంపించామని, అనుమతులు రాగానే పనులు పూర్తి చేస్తామన్నారు.

చిన్నారులకు చేయూత

తేలుకుంచికి చెందిన రుషి బాడిత్య కుటుంబంలో పెద్ద దిక్కు కోల్పోయింది. దీంతో ఆ కుటుంబానికి చెందిన చిన్నారులు ఆర్థికంగా ఇబ్బందులు పడుతున్నారు. విషయం తెలుసుకున్న ఇచ్ఛాపురం పట్టణానికి చెందిన శ్రీరాధాకృష్ణా భజన కమిటీ ప్రతినిధులు ఆదివారం రూ.6 వేలు ఆర్థిక సాయం అందజేశారు. హనుమాన్ సేవా కమిటీ ప్రతినిధులు రూ.5,500 నగదుతోపాటు నిత్యావసర సరకులు అందించారు. – న్యూస్‌టుడే, ఇచ్ఛాపురం గ్రామీణం



అరకొర నీరు.. అవస్థలెలా తీరు?

పలాస నియోజకవర్గంలో తీవ్ర వర్షాభావ పరిస్థితులు నెలకొన్నాయి. ఇప్పటికీ సాధారణ వర్షపాతం కంటే తక్కువ వర్షాలు కురవడంతో నేటికీ నాట్లు పడని పరిస్థితి. కొన్ని ప్రాంతాల్లో కురుస్తున్న అరకొర వర్షాలకు వాగుల్లో చేరిన నీటిని ఆయిల్ ఇంజిన్లతో తోడి దమ్ము పడుతున్నారు. బుడంబొ వద్ద అరకొర నీటిలో ఆదివారం దమ్ము పడుతుండగా ట్రాక్టరు బురదలో కూరుకుపోయింది. దాన్ని మరో ట్రాక్టరుతో బయటకు నెట్టడానికి రైతులు అవస్థలు పడ్డారు. – న్యూస్‌టుడే, మందస



కాలిన పీటీఆర్ స్థానంలో కొత్తది అమరిక



ఇచ్ఛాపురం 33/11కేవీ ఉపకేంద్రంలో ఉండే విద్యుత్తు పంపిణీ నియంత్రిక (పీటీఆర్) కాలిపోవడంతో కొత్తది అమర్చారు. ఇక్కడ రెండు పీటీఆర్‌లతో విద్యుత్తు సరఫరా జరుగుతోంది. అందులో ఒకటి గత ఆదివారం కాలిపోయింది. సమస్య తెలుసుకున్న పలాస ఈఈ యజ్ఞేశ్వరరావు ఇచ్ఛాపురం చేరుకుని ఏఈ కేవీ గోవిందరావు, లైన్‌మెన్ రామచంద్రుడు, ఇతర సిబ్బందితో మాట్లాడారు. కొత్త పరికరం కోసం ఉన్నతాధికారులకు నివేదించారు. వారు స్పందించి, ఉపకరణాన్ని పంపించడంతో ఆదివారం దాన్ని అమర్చారు. – న్యూస్‌టుడే, ఇచ్ఛాపురం

ధర్మానపై కేసు నమోదు సరికాదు

ఎప్పుడో జరిగిన ఉదంతాన్ని పట్టుకుని, దానికి నేరాభియోగాలు మోపి మాజీ మంత్రి ధర్మాన ప్రసాదరావుపై కేసు నమోదు చేయడం బాధాకరమని వైకాపా నాయకులు అన్నారు. ఇచ్ఛాపురం పార్టీ కార్యాలయంలో నియోజకవర్గ సమన్వయకర్త సాడి శ్యామ్‌ప్రసాద్‌రెడ్డి ఆదివారం మాట్లాడారు. ధర్మానపై కేసు నమోదును తీవ్రంగా ఖండించారు. ఒక్క ఇల్లు కూడా కట్టించడం చేతకాని కూటమి ప్రభుత్వం, వైకాపా హయాంలో 20 లక్షల ఇళ్లు కట్టడంతో ఇలా కేసులు బనాయిస్తోందని ఆగ్రహం వ్యక్తం చేశారు. నాయకులు నరేంద్రయాదవ్, దేవరాజు, జయరాం, బేసింగియాదవ్ పాల్గొన్నారు. – న్యూస్‌టుడే, ఇచ్ఛాపురం



ఇచ్ఛాపురం రైలు నిలయంలో లిఫ్ట్ సౌకర్యం

ఇచ్ఛాపురం రైలు నిలయంలో అమృత్ భారత్ పథకంలో భాగంగా జరుగుతున్న అభివృద్ధి పనుల్లో ఒకటి, రెండు ప్లాట్‌ఫాంలపై లిఫ్ట్ పెడుతున్నారు. స్టేషన్‌కు దక్షిణం వైపు ఒక పాదచార వంతెన ఉండగా, ఉత్తరం వైపు కొత్తగా మరొకటి నిర్మించారు. దీనికి అనుసంధానంగా లిఫ్ట్‌లు అమర్చుతున్నారు. దీనికి పునాది పనులతోపాటు ఇనుప స్తంభాల అమరిక పనులు జరుగుతున్నాయి. కొత్త వంతెన మీదుగా రాకపోకలకు అనుమతించారు. పాత వంతెనకు అనుసంధానంగా నాలుగో నంబరు ప్లాట్‌ఫాంకు కొత్త వంతెన పనులు కూడా పూర్తయ్యాయి. కేంద్ర మంత్రి రామ్మోహన్‌నాయుడు, ప్రభుత్వ విప్ బెందాళం అశోక్ కృషి ఫలితంగా అభివృద్ధి పనులు వేగంగా జరుగుతున్నాయని జెడ్ఆర్‌యూసీసీ సభ్యులు శ్రీనివాసరావు తెలిపారు. – న్యూస్‌టుడే, ఇచ్ఛాపురం



టెక్కలి

●టెక్కలి ●నరసన్నపేట ●పాతపట్నం

రాకపోకలకు ఇక్కట్లు..



కొత్తపేట పంచాయతీ పరిధిలో అన్న క్యాంటీన్ పక్క నుంచి ఇందిరానగర్‌కు వెళ్లే రహదారి ఛిద్రమైంది. రాకపోకలకు ఇబ్బందులు పడుతున్నామని స్థానికులు పేర్కొంటున్నారు. గ్రామాల్లో పెద్దఎత్తున సిమెంటు రహదారులు నిర్మిస్తున్న నేపథ్యంలో కనీసం మరమ్మతులు చేపట్టాలని కోరుతున్నారు. నిధులు మంజూరైన వెంటనే పనులు ప్రారంభిస్తామని పీఆర్ ఏఈఈ అంజిత్‌కుమార్ స్పష్టం చేశారు. – న్యూస్‌టుడే, కోటబొమ్మాళి

కూటమితోనే అభివృద్ధి

హిరమండలం, ఎల్ఎన్‌పేట: కూటమి ప్రభుత్వంతోనే అభివృద్ధి సాధ్యమని జడ్పీటీసీ సభ్యుడు పి. బుచ్చిబాబు అన్నారు. ఆదివారం నౌగుడ, సుభలయ గ్రామాల్లో ఇంటింటికీ తెదేపా కార్యక్రమం నిర్వహించారు. బూత్ ఇన్‌ఛార్జి మన్మథరావు పాల్గొన్నారు. ● కొమ్ము‌వలస పంచాయతీలో క్లస్టర్ ఇన్‌ఛార్జి తంగి అప్పన్న ఇంటింటా కరపత్రాలు పంచారు.

భవన నిర్మాణానికి సహకరించండి



జీవో 571 నిబంధనలు అనుసరించి విశాఖపట్నం కొమ్మాదిలో ఉత్తరాంధ్ర వాడ బలిజ సంక్షేమ సంఘ భవన నిర్మాణానికి సహకరించాలని రాష్ట్రమంత్రి కింజరాపు అచ్చెన్నాయుడికి ప్రతినిధులు విన్నవించారు. ఆదివారం నిమ్మాడ కార్యాలయంలో మంత్రికి ఈమేరకు వినతిపత్రం సమర్పించారు. సంఘం అధ్యక్షుడు సోడిపల్లి నారాయణరావు తదితరులు పాల్గొన్నారు. – న్యూస్‌టుడే, కోటబొమ్మాళి

ఆధ్యాత్మికతను పెంపొందించుకోవాలి



భూమి పూజ చేస్తున్న ఎమ్మెల్యే గోవిందరావు


మెళియాపుట్టి, న్యూస్‌టుడే: ప్రతి ఒక్కరూ ఆధ్యాత్మికతను పెంపొందించుకోవాలని ఎమ్మెల్యే మామిడి గోవిందరావు అన్నారు. ఆదివారం మెళియాపుట్టి మండలం పట్టుపురంలో అయ్యప్ప ఆలయ నిర్మాణ పనులకు భూమి పూజ చేశారు. తితిదే శ్రీవాణి ట్రస్ట్ ఆధ్వర్యంలో రూ.40 లక్షలు మంజూరు చేయించడంలో ఎమ్మెల్యే గోవిందరావు చేసిన కృషికి అయ్యప్ప భక్తులు, గ్రామస్థులు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

ప్రత్యేక తరగతులు.. ప్రతిభకు మెరుగులు

● ప్రభుత్వ పాఠశాలల్లో మిషన్ మార్చి-2027 అమలు

– న్యూస్‌టుడే, ఎల్ఎన్‌పేట

పదో తరగతి పరీక్షల్లో ఉత్తీర్ణత శాతాన్ని పెంచేందుకు 'మిషన్ మార్చి-2027' కార్యక్రమాన్ని విద్యాశాఖ ప్రారంభించింది. రోజూ సాయంత్రం 4 నుంచి 5 గంటల వరకు విద్యార్థులకు ప్రత్యేక తరగతులు నిర్వహించేలా చర్యలు చేపట్టింది. దీనికి సంబంధించి రోజువారీ షెడ్యూల్, క్వశ్చన్ బ్యాంకులు, స్టడీ మెటీరియల్ ప్రత్యేకంగా రూపొందించిన ప్రశ్నపత్రాలను ప్రభుత్వ పరీక్షల విభాగం ద్వారా ఆన్‌లైన్‌లో పంపిస్తోంది. వీటిని ఆయా పాఠశాలల్లో విద్యార్థులకు అందజేసి వారి సామర్థ్య స్థాయి పెంచేలా ఉపాధ్యాయులు కృషి చేస్తున్నారు. నిరంతరం విద్యార్థుల ప్రగతిని పర్యవేక్షిస్తూ వెనకబడిన వారికి ప్రత్యేక బోధన కొనసాగించనున్నారు.



ఎల్ఎన్‌పేట: ప్రత్యేక తరగతులకు హాజరైన పదో తరగతి విద్యార్థులు

పదో తరగతి విద్యార్థుల వివరాలు

మండలం	సర్కార్ బడులు	పిల్లలు
ఎల్ఎన్‌పేట	06	203
పాతపట్నం	15	730
హిరమండలం	08	264
కొత్తూరు	11	595
మెళియాపుట్టి	14	737

❖ విద్యార్థులకు సబ్జెక్టుల వారీగా చదివించి అనంతరం పరీక్షలు రాయిస్తారు. అందులో సందేహాలున్నా, తక్కువ మార్కులు వచ్చిన వారిని గుర్తించి వెంటనే సరిదిద్దే కార్యక్రమాన్ని చేపడతున్నారు. ఈ వివరాలన్నీ పక్కాగా దస్త్రాల్లో నమోదు చేస్తున్నారు. నవంబర్ లోగా సిలబస్ పూర్తి చేసి డిసెంబర్ నుంచి వంద రోజుల ప్రణాళికను అమలు చేసేలా చర్యలు తీసుకుంటున్నారు.

ఇదీ పరిస్థితి

పాతపట్నం నియోజకవర్గంలో జడ్పీ ఉన్నత, కేజీబీవీ, ఇతర ప్రభుత్వ పాఠశాలలు మొత్తం 54 ఉన్నాయి. ఇందులో 2,529 మంది విద్యార్థులు పదో తరగతి చదువుతున్నారు. ఈ ఏడాది జులై నుంచి ఈ కార్యక్రమాన్ని అన్ని ప్రభుత్వ పాఠశాలల్లో అమలు చేస్తున్నారు. రోజూ సాయంత్రం ఒక గంట పాటు అదనపు తరగతులు నిర్వహిస్తున్నారు.

అమలు చేస్తున్నాం..

ప్రభుత్వం ఈ ఏడాది పదో తరగతి ఉత్తీర్ణత శాతం పెంచేందుకు ముందస్తు చర్యలు తీసుకుంది. ఈ మేరకు అన్ని ప్రభుత్వ పాఠశాలల్లో మిషన్ మార్చి-2027 అమలు చేసి, నిరంతరం పర్యవేక్షిస్తున్నాం. వెనకబడిన విద్యార్థులను గుర్తించి మెరుగుపరిచేలా చర్యలు చేపట్టాలని ఆయా పాఠశాల ఉపాధ్యాయులకు ఆదేశాలు జారీ చేశాం. – ఎ.రవిబాబు, జిల్లా విద్యాశాఖ అధికారి

అయిదేళ్లుగా.. అసంపూర్తిగా



కోటబొమ్మాళి మేజర్ పంచాయతీలో విలేజ్ హెల్త్ క్లినిక్ నిర్మాణ పనులు అయిదేళ్లుగా నిలిచిపోయాయి. గత ప్రభుత్వ పాలనలో బిల్లుల సమస్య నెలకొనడంతో గుత్తేదారు పనులు ఆపేశారు. ఆ తర్వాత పూర్తిచేసేందుకు అధికారులు ఎలాంటి చర్యలు తీసుకోకపోవడంతో అప్పటి నుంచి స్వర్ణ గ్రామ కార్యాలయంలోనే సేవలు కొనసాగిస్తున్నారు. వీటిపై ఎలాంటి ఆదేశాలు రాలేదని ఎంపీడీవో నారాయణరావు పేర్కొన్నారు.
– న్యూస్‌టుడే, కోటబొమ్మాళి

మాకు అడ్డొస్తే అంతే!

జలుమూరు మండలం చల్లవానిపేట కూడలిలో శునకాలు ప్రయాణికులకు దడపుట్టిస్తున్నాయి. గుంపులు గుంపులుగా తిరుగుతూ రాకపోకలు సాగించే వారిని ఇబ్బందులకు గురిచేస్తున్నాయి. వాహనాల వెంట పరుగులు తీస్తూ ప్రమాదాలకు కారణమవుతున్నాయి. దీంతో ప్రయాణికులు భయాందోళన చెందుతున్నారు. ఈ విషయమై డిప్యూటీ ఎంపీడీవో ఉమామహేశ్వరరావు మాట్లాడుతూ ఉన్నతాధికారులకు తెలియజేసి చర్యలు చేపడతామన్నారు. – న్యూస్‌టుడే, జలుమూరు



దిష్టిబొమ్మల్లా మిగిలాయి..



వనవిష్ణుపురం గ్రామంలో జల్‌జీవన్ మిషన్ పథకంలో భాగంగా ఇంటింటా అమర్చిన కుళాయిల నుంచి సుమారు 15 రోజులుగా తాగునీరు రావడం లేదని స్థానికులు వాపోతున్నారు. అధికారుల దృష్టికి తీసుకెళ్లినా పట్టించుకోవడం లేదని చెబుతున్నారు. ఈ విషయమై ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ శ్రీనివాసరావు మాట్లాడుతూ క్షేత్రస్థాయిలో పరిశీలించి సమస్య పరిష్కరిస్తామని పేర్కొన్నారు. – న్యూస్‌టుడే, పోలాకి

చినుకు పడితే వణుకే..

టెక్కలి పాత కోర్టు భవనం ఎదురుగా రహదారిపై మురుగు నీరు నిలిచిపోతుండటంతో స్థానికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఈ మార్గంలో సబ్ కలెక్టర్ కార్యాలయం, పలు ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలలు, కళాశాలలు, బాలికల వసతి గృహాలు ఉండటంతో మురుగులోనే రాకపోకలు చేయాల్సి వస్తోందని వాపోతున్నారు. సమస్యపై మండల ఇంజినీరింగ్ అధికారి ఎస్.లక్ష్మునాయుడు మాట్లాడుతూ ప్రతిపాదనలు పంపించి చర్యలు చేపడతామన్నారు.
– న్యూస్‌టుడే, టెక్కలి పట్టణం



విలువల్ని సజీవంగా ఉంచేది సాహిత్యం

కొత్తూరు: విలువల్ని సజీవంగా ఉంచేది సాహిత్యమని కొత్తూరు రచయితల వేదిక(కొరవే)అధ్యక్షుడు కలమట శ్రీరాములు అన్నారు. స్థానిక విజ్ఞానభారతి ఉన్నత పాఠశాల ఆవరణలో కొరవే సమావేశం నిర్వహించారు.

విద్యాసామగ్రి పంపిణీ

పోలాకి, న్యూస్‌టుడే: పోలాకి, ప్రియాగ్రహారం ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో ఇంటర్ విద్యార్థులకు సంకల్ప విద్యా సామగ్రిని పంపిణీ చేశారు. వీటి సాయంతో పరీక్షల్లో మెరుగైన ఫలితాలు సాధించేలా కృషి చేస్తామని ప్రిన్సిపల్స్ పద్మలత, జగదీశ్ తెలిపారు.

గ్రామాభివృద్ధికి సహకరించండి

నరసన్నపేట, న్యూస్‌టుడే: పంచాయతీ ఎన్నికల సమయంలో ప్రజల మధ్య ఎలాంటి విభేదాలకు తావులేకుండా గ్రామాభివృద్ధికి అందరూ తోడ్పడాలని ఎస్సై గణేష్ సూచించారు. మాకివలస గ్రామంలో పల్లెనిద్ర కార్యక్రమంలో భాగంగా గ్రామస్థులతో ఆయన సమావేశమయ్యారు. ఏఎస్సై అసిరినాయుడు పాల్గొన్నారు.

పోలింగ్‌బూత్‌ల పరిశీలన

పాతపట్నం, న్యూస్‌టుడే: పాతపట్నం మండలం పెద్దసీది పంచాయతీ పరిధిలోని 49, 50 పోలింగ్ బూత్‌లను తహసీల్దారు ఎన్.ప్రసాదరావు తనిఖీ చేశారు. పోలింగ్ కేంద్రాల వద్ద కొత్త ఓటరు నమోదు కార్యక్రమాన్ని పరిశీలించారు. అర్హులైన వారందరికీ ఓటు హక్కు కల్పించే విధంగా బీఎల్వోలు పనిచేయాలని సూచించారు. వీఆర్వో లోకేశ్ ఉన్నారు.

శ్రీశయన సంఘ కార్యవర్గ ఎన్నిక

కోటబొమ్మాళి, న్యూస్‌టుడే: కోటబొమ్మాళిలో ఆదివారం శ్రీశయన సంఘం నూతన కార్యవర్గ ఎన్నిక ఏకగ్రీవమైంది. సంఘ గౌరవ అధ్యక్షుడిగా లొట్టి రామారావు, అధ్యక్షుడిగా లింగుబారి సంపత్‌కుమార్, ప్రధాన కార్యదర్శిగా గేదెల పాపారావు, ఉపాధ్యక్షుడిగా దాసరి నాగరాజు, ఇతరులు ఎన్నికయ్యారు. వారిని పలువురు అభినందించారు.

ముగిసిన సప్తాహం



కొత్తూరు: స్థానిక సీతారామ మందిరంలో గత ఏడు రోజులుగా నిర్వహిస్తున్న హరే రామ హరే కృష్ణ సప్తాహం ఘనంగా ముగిసింది. కమిటీ సభ్యులు తులసీ వరప్రసాద్, తాతబాబు నాయుడు, అర్జునరావు, రవి ఎల్.భగవాన్ నాయుడు ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం జరిగింది.

ఆత్యా-పత్యా రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపిక



టెక్కలి ప్రభుత్వ ఉన్నత పాఠశాల క్రీడాప్రాంగణంలో ఆదివారం నిర్వహించిన ఆత్యా-పత్యా జిల్లా జట్ల ఎంపిక ఉత్సాహంగా జరిగింది. పలు మండలాల నుంచి 182 మంది క్రీడాకారులు పోటీల్లో పాల్గొన్నారు. అనంతరం బాలబాలికల విభాగాల్లో తుది జట్లను ఎంపిక చేశారు. సెప్టెంబరు 12, 13 తేదీల్లో కర్నూల్‌లో జరగనున్న రాష్ట్రస్థాయి పోటీల్లో క్రీడాకారులు పాల్గొననున్నట్లు అసోసియేషన్ ప్రతినిధులు తెలిపారు. – న్యూస్‌టుడే టెక్కలి పట్టణం

నేడు విద్యుత్తు సరఫరా నిలిపివేత.. నరసన్నపేట గ్రామీణం, పోలాకి: ఉర్లాం విద్యుత్తు ఉపకేంద్రం పరిధిలో నిర్వహణ పనుల నిమిత్తం సోమవారం ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 2 వరకు సరఫరా నిలిపివేస్తున్నామని ఈఈ నర్సింహకుమార్ తెలిపారు. మబగాం, పోలాకి పరిధిలో ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 2 వరకు సరఫరా ఉండదన్నారు.

అందుబాటులో మంత్రి.. కోటబొమ్మాళి, న్యూస్‌టుడే: రాష్ట్రమంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు సోమవారం ఉదయం మాత్రమే కోటబొమ్మాళి మండల ప్రజలకు, కార్యకర్తలకు అందుబాటులో ఉంటారని నిమ్మాడ కార్యాలయం ఒక ప్రకటనలో తెలియజేసింది.

భర్తకు తలకొరివి పెట్టిన భార్య



సంతబొమ్మాళి మండలం మలాగం పంచాయతీ సూరాడవానిపేటలో భర్తకు భార్య తలకొరివి పెట్టిన ఘటన ఆదివారం చోటుచేసుకుంది. సూరాడవానిపేటకు చెందిన సూరాడ మోహనరావు అనారోగ్యంతో మృతి చెందారు. ఇద్దరు కుమార్తెలకు వివాహం కావడం, కుమారుడు విదేశాల్లో ఉండటంతో భార్య సత్యవతి అంత్యక్రియలు నిర్వహించినట్లు కుటుంబ సభ్యులు పేర్కొన్నారు. – న్యూస్‌టుడే, సంతబొమ్మాళి

విద్యార్థుల ప్రతిభ

కొత్తూరు, న్యూస్‌టుడే: విజయనగరంలోని విజ్ఞానభారతి పాఠశాలలో ఆదివారం నిర్వహించిన సమితి స్థాయి విజ్ఞాన మేళాలో తమ పాఠశాల విద్యార్థులు సత్తాచాటారని కొత్తూరు విజ్ఞానభారతి స్కూల్ ప్రిన్సిపల్ శ్రీరాములు తెలిపారు. సీనియర్స్ విభాగంలో జి.శ్యామసుందర రావు, జి.జయంత్ కుమార్, కె.ధనంజయరావు, ఎ.రోషన్ కుమార్ వివిధ విభాగాల్లో సత్తాచాటారన్నారు. త్వరలో విజయవాడలో జరగనున్న రాష్ట్రస్థాయి పోటీల్లో వీరు ప్రాతినిధ్యం వహించనున్నట్లు ఆయన పేర్కొన్నారు.

అయ్యప్ప ఆలయ వార్షికోత్సవానికి ఏర్పాట్లు

సారవకోట, న్యూస్‌టుడే: కోదడ్డపనస గ్రామ సమీప కొండపై కొలువైన అయ్యప్ప స్వామి ఆలయ వార్షికోత్సవం కోసం ఏర్పాట్లు ముమ్మరంగా చేస్తున్నారు. మంగళవారం వార్షికోత్సవం జరుగుతుందని కమిటీ సభ్యులు తెలిపారు.

మహిళలతో రాజకీయం చేయడం తగదు

సంతబొమ్మాళి, న్యూస్‌టుడే: సంతబొమ్మాళి మండలం నౌపడ-2 ఎంపీటీసీ సభ్యుడు సుధాకర్ మహిళలను అడ్డుపెట్టుకుని రాజకీయాలు చేస్తున్నారని జనసేన పార్టీ నియోజకవర్గ నాయకుడు లింగూడు కుమార్ ఆరోపించారు. ఈ మేరకు ఆదివారం విలేకరులతో మాట్లాడారు. మూలపేట పునరావాస కాలనీ తాగునీరు పైప్‌లైన్ పనులు జరుగుతుండగా ఉద్దేశపూర్వకంగానే కొందరు మహిళలతో రెచ్చగొట్టే వ్యాఖ్యలు చేయిస్తున్నారని మండిపడ్డారు.

శ్రీకాకుళం
•శ్రీకాకుళం •ఆమదాలవలస •ఎచ్చెర్ల

వెంబడిస్తూ.. బెంబేలెత్తిస్తున్నాయ్



మురపాక పంచాయతీ పీబీ నగర్ కాలనీలో శునకాలు గుంపులుగా సంచరిస్తూ బెంబేలెత్తిస్తున్నాయని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. లేగదూడలు, గొర్రెలు, మేకలపై దాడి చేస్తున్నాయని వాపోతున్నారు. వాహనాలను వెంబడించడంతో చోదకులు పడిపోయి గాయాలపాలవుతున్నారు. అధికారులు స్పందించి చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు. ఈ సమస్యను డిప్యూటీ ఎంపీడీవో ఐ.పద్మజ వద్ద ప్రస్తావించగా ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు నియంత్రణ చర్యలు చేపడతామన్నారు. – న్యూస్‌టుడే, లావేరు

తెరపై ఈనాడు

● సరస్వతి, మారుతి, కిన్నెర: ఇరుముడి ● కీర్తన: హేయ్, ● కీర్తిక: హుషారు పిట్టలు ● సూర్యమహల్: విశ్వనాథ్ అండ్ సన్స్ ● చంద్రమహల్ (సన్‌మ్యాక్స్): డీసీ ● ఎస్‌వీసీ (రామలక్ష్మణ): టాక్సిక్

– న్యూస్‌టుడే, పాతబస్టాండ్

పారదర్శక పాలన అందిస్తున్నాం: ఎంపీ

రణస్థలం, న్యూస్‌టుడే: పారదర్శక పాలనతో కూటమి ప్రభుత్వం అందరి మన్ననలు పొందుతోందని ఎంపీ కలిశెట్టి అప్పలనాయుడు అన్నారు. పైడిభీమవరంలో ఆదివారం ఇంటింటికీ తెదేపా కార్యక్రమం నిర్వహించారు. ప్రభుత్వం చేపడుతున్న కార్యక్రమాలను ప్రజలకు వివరించారు. రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో గెలుపే లక్ష్యంగా పనిచేయాలన్నారు. పీఏసీఎస్ అధ్యక్షురాలు డి.సుశీల, రౌతు శ్రీనివాసరావు, భానోజీనాయుడు, కనకారావు పాల్గొన్నారు.

తాగు, సాగు నీటికి ప్రాధాన్యం

● నమస్తే ఎచ్చెర్ల కార్యక్రమంలో ఎమ్మెల్యే



కంబాలపేటలో అంగన్‌వాడీ కేంద్రం ప్రారంభిస్తున్న ఎంపీ కలిశెట్టి అప్పలనాయుడు, ఎమ్మెల్యే ఈశ్వరరావు

రణస్థలం, న్యూస్‌టుడే: ఎచ్చెర్ల నియోజకవర్గాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేయడమే ధ్యేయమని ఎమ్మెల్యే ఎన్.ఈశ్వరరావు అన్నారు. ఆదివారం బంటుపల్లి పంచాయతీలో 'నమస్తే ఎచ్చెర్ల' కార్యక్రమం నిర్వహించారు. బంటుపల్లి పంచాయతీని అభివృద్ధి చేసినట్లే నియోజకవర్గంలోని అన్ని పంచాయతీలను అభివృద్ధి చేస్తామన్నారు. తాగు, సాగు, విద్య, వైద్యానికి ప్రాధాన్యం ఇస్తూ ముందుకు సాగుతున్నామన్నారు. కంబాలపేటలో రక్షిత నీటి పథకం, అంగన్‌వాడీ భవనం, బంటుపల్లిలో అంగన్‌వాడీ భవనం, సీసీ రహదారిని ప్రారంభించారు. కార్యక్రమంలో ఎంపీ కలిశెట్టి అప్పలనాయుడు, నాయకులు చౌదరి బాబ్జి, లంక శ్యామ్, ముప్పిడి సురేష్, బెండి మల్లేశ్వరరావు, కుమరాపు రవి పాల్గొన్నారు.

ఆక్రమణల తొలగింపును అడ్డుకున్న స్థానికులు

శ్రీకాకుళం నేరవార్తా విభాగం: నగరంలోని ప్రభుత్వ మహిళా కళాశాల రోడ్డులో ఉన్న కుమ్మరవీధిలో నగరపాలక సంస్థ అధికారులు ఆదివారం ఆక్రమణలు తొలగించేందుకు చేసిన ప్రయత్నాలు విఫలమయ్యాయి. ఇక్కడ నివాసముంటున్న లావేరు మహిళా పోలీసు కానిస్టేబుల్, అదే ప్రాంతంలో ఉంటున్న సీఆర్‌పీఎఫ్ కానిస్టేబుల్ కుటుంబాల మధ్య వాహన పార్కింగ్ విషయమై వివాదం మొదలైంది. దీంతో వీధంతా ఆక్రమణలున్నాయంటూ వీరిద్దరూ ఒకరిపై ఇంకొకరు ఎస్పీ, నగరపాలక సంస్థ అధికారులకు ఫిర్యాదులు చేశారు. ఒకటో పట్టణ పోలీసులు ఇద్దరిపైనా కేసులు నమోదు చేశారు. తాజాగా నగరపాలక సంస్థ కమిషనర్ శ్రావణ్‌కుమార్ స్పందించి వీధిలో ఆక్రమణలుంటే తొలగించాలని పట్టణ ప్రణాళికా విభాగం సిబ్బందిని ఆదేశించారు. ఆదివారం సిబ్బంది అక్కడికి వెళ్లి ఆక్రమణలను తొలగించడానికి సిద్ధమవడంతో స్థానికులు అడ్డుకున్నారు. దీంతో చేసేదిలేక నగరపాలక సంస్థ సిబ్బంది వెనుదిరిగి వెళ్లాల్సి వచ్చింది.

శిక్షణ అందినా.. ఉపాధి లేదాయే

● కుట్టు యంత్రాల కోసం మహిళల నిరీక్షణ

– న్యూస్‌టుడే, సరుబుజ్జిలి



సరుబుజ్జిలి కేంద్రంలోని కుట్టు శిక్షణలో మహిళలు

మహిళలు స్వయం ఉపాధితో ఆర్థిక ప్రగతి సాధించి కుటుంబానికి ఆసరాగా నిలవాలనే లక్ష్యంతో కూటమి ప్రభుత్వం కుట్టు శిక్షణ కార్యక్రమాన్ని తీసుకొచ్చింది. గ్రామీణ ప్రాంతాల్లోని మహిళలను ఎంపిక చేసి ఈ శిక్షణ ఉచితంగా అందించి, అనంతరం ధ్రువపత్రాలతోపాటు కుట్టు మిషన్లు పంపిణీ చేసేది. దీంతో వారి ఉపాధికి మార్గం ఏర్పడేది. అయితే ఈ శిక్షణ పొందిన మహిళలకు మిషన్ల కోసం నిరీక్షణ తప్పడం లేదు. మరో వైపు ధ్రువపత్రాలు సైతం ఇవ్వకపోవడంతో మహిళలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అధికారులను అడగగా ఇదిగో అదిగో అంటూ కాలం వెళ్లదీస్తున్నారని వాపోతున్నారు. గతేడాది ఏప్రిల్‌లో ఈ కార్యక్రమం నిర్వహించగా వారికి ఇప్పటికీ మిషన్లు పంపిణీ చేయకపోవడం గమనార్హం.

ఇదీ పరిస్థితి..

ఆమదాలవలస నియోజకవర్గంలోని 110 పంచాయతీలు ఉన్నాయి. సరుబుజ్జిలి, ఆమదాలవలస, పొందూరు, బూర్జ నాలుగు మండలాల్లో మొదటి విడతగా 327 మంది మహిళలను నాలుగు కేంద్రాల్లో శిక్షణకు ఎంపిక చేశారు. వీరిని రోజుకు రెండు బ్యాచ్‌లుగా విడదీసి బీసీ కార్పొరేషన్ అధికారుల ఆధ్వర్యంలో ఉదయం, మధ్యాహ్నం శిక్షణ అందించారు. 90 రోజులపాటు ఇది కొనసాగింది. వీరికి ధ్రువపత్రంతో పాటు కుట్టు యంత్రాలను అందించాల్సి ఉండగా అదీ జరగలేదు.

ప్రభుత్వానికి పంపించాం..

అధికారుల నుంచి వచ్చిన దరఖాస్తులను పరిశీలించి సంబంధిత మహిళలకు 90 రోజుల పాటు పూర్తి స్థాయిలో శిక్షణ ఇచ్చాం. ఇది మహిళలకు ఎంతో ఉపయోగకరమైంది. ఇంటి వద్దనే ఉంటూ స్వయం ఉపాధి పొందొచ్చు. మిషన్లు, ధ్రువపత్రాల విషయంలో పూర్తి వివరాలను ప్రభుత్వానికి పంపించాం. మంజూరు చేసిన వెంటనే అందజేస్తాం.

– చంద్రశేఖర్‌రావు, ఆర్.లక్ష్మి, రమణమ్మ (బీసీ కార్పొరేషన్ జిల్లా కోఆర్డినేటర్లు)

ఆకట్టుకున్న ఆధ్యాత్మిక ప్రవచనం



శ్రీకాకుళం సాంస్కృతికం, న్యూస్‌టుడే: నగరంలోని కోదండరామాలయ ప్రాంగణంలో ఉపనిషన్మందిరంలో విశ్రాంత ఉద్యోగి ఆర్.ప్రసాదరావు ఆధ్యాత్మిక ప్రవచనం జరిగింది. ఆయన గణపతి వైభవాన్ని వివరించారు. కార్యక్రమంలో ఉపనిషన్మందిరం ప్రతినిధులు కామేశ్వరరావు, విశ్వేశ్వరరావు, బాబూరావు, చంద్రరావు, సరస్వతి, అరుణకుమారి పాల్గొని ప్రసాదరావును సత్కరించారు.

పకడ్బందీగా ప్రవేశ పరీక్ష



శ్రీశివానీ ఇంజినీరింగ్ కళాశాల వద్ద అభ్యర్థులను తనిఖీ చేస్తున్న సిబ్బంది

ఎచ్చెర్ల, న్యూస్‌టుడే: ఎంబీబీఎస్ పూర్తిచేసిన అభ్యర్థులకు పీజీ కోర్సుల్లో ప్రవేశాలు కల్పించేందుకు జాతీయ స్థాయిలో నిర్వహిస్తున్న నీట్ పీజీ 2026 ఆదివారం ప్రశాంతంగా జరిగింది. ఎచ్చెర్లలో శ్రీ వెంకటేశ్వర, చిలకపాలెం సమీపంలోని శ్రీ శివానీ ఇంజినీరింగ్ కళాశాలలో పరీక్షా కేంద్రాలను ఏర్పాటు చేశారు. ఉదయం 7 గంటలకే అభ్యర్థులు ఈ కేంద్రాలకు చేరుకున్నారు. ఎటువంటి ఇబ్బందులు కలగకుండా పోలీసు శాఖ బందోబస్తు ఏర్పాటు చేసింది.

పనికిరాని మొక్కలు తొలగించరూ..



ఆమదాలవలస పుర పరిధి కె.మన్నయ్యపేటలో ప్రభుత్వ పాఠశాల ప్రహరీ పక్కన పనికిరాని మొక్కలు పెరిగి విష కీటకాలు చేరుతున్నాయని విద్యార్థులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. కాలువను సైతం కప్పేశాయని, దీంతో మురుగు కదలడం లేదని వాపోతున్నారు. అధికారులు స్పందించి సమస్యను పరిష్కరించాలని కోరుతున్నారు. తక్షణమే తొలగించే విధంగా చర్యలు చేపడతామని మున్సిపల్ కమిషనర్ టి.రవి తెలిపారు. – న్యూస్‌టుడే, ఆమదాలవలస గ్రామీణం

ట్రాఫిక్ నిబంధనలు తప్పకుండా పాటించాలి



ట్రాఫిక్ సీఐ రామారావును సత్కరిస్తున్న కాకినాడ ఆదిత్య ప్రిన్సిపల్ వేణుగోపాలరావు తదితరులు

కలెక్టరేట్ (శ్రీకాకుళం), న్యూస్‌టుడే: యువత వాహనాలను నడిపే సమయంలో ట్రాఫిక్ నిబంధనలను తప్పనిసరిగా పాటించాలని ట్రాఫిక్ సీఐ రామారావు తెలిపారు. నగరంలోని కాకినాడ ఆదిత్య డిగ్రీ కళాశాలలో ఆదివారం ట్రాఫిక్ నిబంధనలపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రతి ఒక్కరూ విధిగా హెల్మెట్ ధరించాలన్నారు. దీని వల్ల ప్రమాద సమయంలో తలకు ఎలాంటి దెబ్బ తగలకుండా ఉంటుందన్నారు. వాహనాలను అతి వేగంగా నడపడం వల్ల మీతో పాటు పక్కన వెళ్లే వారికి కూడా నష్టం జరుగుతుందన్నారు. అనంతరం సీఐ రామారావును సత్కరించారు. కళాశాల ప్రిన్సిపల్ వేణుగోపాలరావు, ఎన్ఎస్ఎస్ అధికారులు మోహనరావు, దుర్గా ప్రసాద్ పాల్గొన్నారు.

అభివృద్ధి పనులపై విమర్శలు సరికాదు



మాట్లాడుతున్న ఆరో వార్డు తెదేపా ఇన్‌ఛార్జి రమణ

ఆమదాలవలస పట్టణం, న్యూస్‌టుడే: గత వైకాపా పాలనలో ఆమదాలవలస పట్టణానికి జరిగిన మేలు ఏమిటో వైకాపా నాయకులు చెప్పాలని 6వ వార్డు తెదేపా ఇన్‌ఛార్జి పాతిన రమణ డిమాండ్ చేశారు. స్థానిక తెదేపా కార్యాలయంలో ఆదివారం ఆయన మాట్లాడుతూ.. వైకాపా నాయకులు కూటమి ప్రభుత్వంలో జరుగుతున్న అభివృద్ధి పనులను చూసి ఓర్వలేక విమర్శలు చేస్తున్నారని మండిపడ్డారు. ఏ ప్రభుత్వంలో ఎంత అభివృద్ధి జరిగిందో పుర ప్రజలు గమనిస్తున్నారని పేర్కొన్నారు. తెదేపా నాయకులు దవళ అప్పలనాయుడు, సంతోష్, సురేష్, రామకృష్ణ పాల్గొన్నారు.

నేడు తిరువీధి ఉత్సవం

శ్రీకాకుళం సాంస్కృతికం, న్యూస్‌టుడే: నగరంలోని అరసవల్లి రహదారిలో రమ్యతిరుమలలో సోమవారం సాయంత్రం సామూహిక విష్ణు సహస్ర నామ పారాయణం, తిరువీధి మహోత్సవం ఉంటుందని ఆలయ అర్చకులు కరి వేణుమాధవాచార్యులు తెలిపారు. భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొనాలని కోరారు.

వైభవంగా శోభాయాత్ర

సరుబుజ్జిలి, న్యూస్‌టుడే: త్రిదండి శ్రీమన్నారాయణ రామానుజ చిన్నజీయర్ స్వామి వారి 70వ తిరునక్షత్ర రొట్టవలస గ్రామంలో ఆదివారం ఘనంగా నిర్వహించారు. శ్రీరామ ఆనంద ఆశ్రమం, శ్రీ కోదండ రామాలయం ప్రాంగణం నుంచి గ్రామ పుర వీధుల్లో కలశంతో శోభాయాత్ర నిర్వహించారు. ఆశ్రమం నిర్వాహకుడు తొత్తడి వెంకటరమణ, భక్తులు పాల్గొన్నారు.

ఉత్తరేశ్వరస్వామికి ప్రత్యేక పూజలు



శ్రీకాకుళం సాంస్కృతికం, న్యూస్‌టుడే: శ్రీకాకుళం నగరంలోని బలగ మెట్టు దరి ఉత్తరేశ్వరాలయంలో ఆదివారం స్వామికి సహస్ర ఘటాభిషేకం, పంచామృతాభిషేకం నిర్వహించారు. ఆలయ అర్చకుల ఆధ్వర్యంలో సుప్రభాత సేవ, వినాయకుడి పూజ, ఉమామహేశ్వరి అమ్మవారికి కుంకుమ పూజ, నందీశ్వరుడికి గంగా జలంతో అభిషేకం చేశారు. ఉత్సవ మూర్తుల ఊరేగింపు ఘనంగా జరిగింది. ● నగరంలో నారాయణ తిరుమలలో శ్రీవారి పుష్కరిణి నిర్మాణం కోసం ఆలయ అర్చకులు జి.శ్రీనివాసులు ఆధ్వర్యంలో మహిళల సత్సంగ కార్యక్రమం జరిగింది. పుష్కరిణి నిర్మాణ పనులు గురించి చర్చించారు.

కూరగాయల ధరలు

శ్రీకాకుళం రైతుబజారులో కూరగాయల నిన్నటి ధరలు (కిలో.. రూపాయల్లో):

● టమాటాలు 24 ● వంకాయలు 26/34 ● బెండ 24 ● పచ్చిమిర్చి 50 ● కాకర 34 ● బీర 40 ● క్యాబేజీ బుట్ట 30 ● క్యారెట్ 40 ● దొండ 30 ● బంగాళదుంపలు 17 ● ఉల్లిపాయలు 44/48 ● గోరుచిక్కుడు 34 ● ఆనప 20 ● అరటికాయ(జత) 18 ● మునగకాడలు 40 ● గోల్కొండ చిక్కుడు 24 ● అల్లం 110/170 ● వెల్లుల్లి 180 ● బీట్రూట్ 40 ● కీరదోస 40 ● పప్పుదోస 24 ● ముల్లంగి 30 – న్యూస్‌టుడే, కలెక్టరేట్(శ్రీకాకుళం)

వ్యర్థాల గుట్టలు.. తొలగక తిప్పలు



పొందూరు మండలం దళ్లవలసలోని రహదారి పక్కనే వ్యర్థాలు గుట్టలుగా దర్శనమిస్తున్నాయి. ఊరిలో సేకరించిన చెత్తను తీసుకొచ్చి ఇక్కడ వేస్తున్నారని గ్రామస్థులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. దుర్వాసనతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని వాపోతున్నారు. అధికారులు స్పందించి చర్యలు చేపట్టాలని కోరుతున్నారు. ఈ విషయాన్ని ప్రత్యేకాధికారి పీటీరాజు వద్ద ప్రస్తావించగా పరిశీలించి చర్యలు చేపడతామన్నారు.

– న్యూస్‌టుడే, పొందూరు గ్రామీణం

త్రుటిలో తప్పిన ప్రమాదాలు

రణస్థలం, ఆమదాలవలస గ్రామీణం, న్యూస్‌టుడే: జేఆర్‌పురంలోని జాతీయ రహదారిపై తహసీల్దార్ కూడలిలో ఆదివారం సాయంత్రం శ్రీకాకుళం నుంచి విశాఖ వెళ్తున్న కారును వెనక నుంచి లారీ ఢీకొట్టింది. దీంతో కారు రోడ్డుకు అడ్డంగా తిరిగి ఆగిపోయింది. అందులో ముగ్గురు ఉండగా అందరూ సురక్షితంగా బయటపడటంతో ఊపిరిపీల్చుకున్నారు. కొంత సమయం ట్రాఫిక్‌కు అంతరాయం కలిగింది. ● ఆమదాలవలస - శ్రీకాకుళం ప్రధాన రహదారిలో శ్రీకాకుళం వైపు వెళ్తున్న ఓ కారు ఒక్కసారిగా పంటపొలాల్లోకి దూసుకు పోయింది. కొందరు అడ్డుగా రావడంతో వారిని తప్పించే క్రమంలో కారు పొలాల్లోకి దూసుకెళ్లినట్లు స్థానికులు తెలిపారు. ఎవరికీ ఏమీ కాకపోవడంతో అంతా ఊపిరి పీల్చుకున్నారు. కొందరి సాయంతో కారును బయటకు తీశారు. అనంతరం యథావిధిగా వెళ్లిపోయింది.

సందడిగా క్విజ్ పోటీలు

శ్రీకాకుళం సాంస్కృతికం, న్యూస్‌టుడే: నగరంలో కలెక్టర్ బంగ్లా దరి చిల్డ్రన్స్ లాఫింగ్‌క్లబ్ ఆధ్వర్యంలో ఆదివారం చిన్నారులకు క్విజ్ పోటీలు నిర్వహించారు. ఎల్.నందికేశ్వరరావు నిర్వహణలో జరిగిన ఈ పోటీల్లో పలు పాఠశాలలకు చెందిన విద్యార్థులు పాల్గొన్నారు. విజేతలకు బహుమతులు ప్రదానం చేశారు.